

బాపట్ల క్రీడా వికాస కేంద్రంలో టగ్గాఫ్ వార్ పోటీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఎం నారా చంద్రబాబు నాయుడు



చంద్రబాబుతో మంత్రి లోకేశ్

సర్...సర్ అంటూ లోకేశ్

లకేశ్ తండ్రి చంద్రబాబు. కానీ ప్రభుత్వ కార్యక్రమంలో చంద్రబాబును తండ్రిలా కాకుండా ముఖ్యమంత్రిలాగానే లోకేశ్ గౌరవించారు. పలు అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ శాఖ మంత్రి అయిన లోకేశ్‌ను వివరాలు అడగడం.. వాటికి లోకేశ్ సర్.. సర్.. అంటూ సమాధానాలు చెప్పారు. వేదికపై కూడా సీఎం పలు సూచనలను మంత్రికి ఇవ్వడం ఆయన వినమ్రంగా అలాగే సర్ అనడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆసక్తిగా గమనించారు. విద్యా సంబంధమైనది కార్యక్రమం కావడం సదరు శాఖ మంత్రిగా లోకేశ్ ఆహ్వానం మేరకు హాజరుకాగా, ప్రభుత్వ పెద్దగా ముఖ్యమంత్రి ఈ మీట్‌లో పాల్గొన్నారు.



పేరెంట్-టీచర్ మీట్‌కు హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

నిరాడంబరంగా..
బడి సంబరం

- బాపట్ల మున్సిపల్ హైస్కూల్ వేదికగా చదువుల పండుగ
- హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్
- బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో పెండింగ్‌లోని నిర్మాణాలకు హామీ
- డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం అంటూ ముఖ్యమంత్రి పిలుపు
- అందరూ బాధ్యతతో ఉంటే విద్యార్థుల భవిష్యత్ బంగారు బాటేనన్న బాబు



విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న చంద్రబాబు, లోకేశ్



ముగ్గులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నరేంద్రవర్మ తదితరులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బడి పండుగ.. నిరాడంబరంగా, ఆసక్తికరంగా, విద్యార్థుల ను ఉత్సాహపరుస్తూ, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు సూచనల మధ్య సాగింది. శనివారం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బాపట్ల మున్సిపల్ హైస్కూల్ వేదికగా శ్రీకారం చుట్టారు. నేతల హడావుడి లేకుండా.. హంగు ఆర్భాటాలకు తావులేకుండా.. అధికారదర్పం కాన రాకుండా.. కేవలం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థుల భవిష్యత్ బంగారుబాట కావాలంటే అందరూ బాధ్యత గా ఉంటేనే సాధ్యపడుతుందని ఈ మీట్ ద్వారా సందేశమిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు మంత్రి లోకేశ్ దాదాపు మూడు గంటలపాటు విద్యార్థులు, తల్లి దండ్రులు, టీచర్ల మధ్య గడిపారు. విద్యావ్యవస్థలో ఉన్న లోపాలు సవరించుకోవడం కోసం అర్థవంతమైన చర్చకు ఈ సమావేశం ఆస్కారమిచ్చింది. హైస్కూల్ లోని తరగతి గదుల్లోకి వెళ్లి నేరుగా విద్యార్థులను వారి తల్లిదండ్రులతో మాట్లాడిన ముఖ్యమంత్రి వారి లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను కూడా వివిధ అంశాలపై ప్రశ్నించారు. ఆ తర్వాత ముగ్గుల పోటీలను స్వయంగా లోకేశ్‌తో కలిసి పరిశీలించారు. ముగ్గులు బాగున్నాయంటూ మహిళలను ప్రశంసించారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో ఉన్న ముగ్గును పరిశీలించిన లోకేశ్ ఇదిముఖ్యమని వ్యాఖ్యా నించడంతో అక్కడ నవ్వులు విరబూశాయి. అనంతరం వేదిక వద్దకు వచ్చిన ముఖ్యమంత్రి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ముఖాముఖి నిర్వహించారు. డ్రగ్స్ వద్దు బ్రో అంటూ ఓ విద్యార్థి ఇచ్చిన సందేశం ముఖ్యమంత్రి చేత చప్పట్లు కొట్టించడంతో పాటు అందరూ డ్రగ్స్ వద్దు బ్రో అంటూ శృతి కలిపారు. సైబర్ మోసాల గురించి ఓ విద్యార్థిని చేసిన ప్రసంగం కూడా ఆలోచింప చేసింది. విద్యార్థులతో కలిసి చంద్రబాబు, లోకేశ్ నేలపైనే కూర్చొని సహపంక్తి భోజనాలు చేశారు.

పాఠశాల స్థాయి నుంచే డ్రగ్స్‌పై యుద్ధం

రాష్ట్రంలో డ్రగ్స్ అనే మాటే ఎక్కడా వినపడకూడదని చంద్రబాబు అన్నారు. పాఠశాల స్థాయి నుంచే డ్రగ్స్ మీద యుద్ధం ప్రారంభం కావాలన్నారు. గంజాయిని కొంతమంది పెరట్లో కూరగాయ మొక్కల్లా పండిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణాను అడ్డుకోవడానికి ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేశామని ఆ వ్యవస్థను కూకటి వేళ్లతో పెకిలిస్తామని తెలిపారు. నిరంతరం నేర్చుకోవడం ద్వారానే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ముందంజలో ఉండాలని విద్యార్థులకు సూచించారు. రాబోయే రోజుల్లో అన్ని పాఠశాలల్లో హెల్త్ కార్డులు, ప్రోగ్రెస్ కార్డులతో పాటు విద్యార్థుల అటెండెన్స్ సమాచారాన్ని ఫోన్ల ద్వారా తల్లిదండ్రులకు తెలియజేస్తామన్నారు. పిల్లలు స్మార్ట్ ఫోన్లకు బానిసలు కాకుండా జాగ్రత్తగా ఉండాలని వీటి విషయంలో తల్లిదండ్రుల పర్యవేక్షణ కీలకమన్నారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌ను వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అన్ని వసతులతో తీర్చిదిద్దుతామని సీఎం హామీ ఇచ్చారు

చంద్రబాబు సూచనలు

- పిల్లల భవిష్యత్ బంగారు మయం కావాలంటే తల్లిదండ్రుల పాత్ర కీలకం. ఇందులో తల్లి పాత్ర మరింత ఎక్కువ. చిన్నప్పుడు నాకు చదువు చెప్పిన టీచర్‌ను ఇప్పటికీ గుర్తు పెట్టుకుంటాను. ఇదే మన సంస్కృతి గొప్పదనం.
- పిల్లల చదువునే తల్లిదండ్రులు ఆస్తిగా భావించాలి. పిల్లల భవిష్యత్ గురించి తల్లిదండ్రులు కలిసి కూర్చొని మాట్లాడుకుంటూ ఉండాలి.
- పిల్లలు విచ్చలవిడిగా సెల్‌ఫోన్ వాడకం శ్రేయస్కరం కాదు. ఈ విషయంలో తల్లిదండ్రులు ఎక్కువగా బాధ్యత తీసుకోవాలి.
- డ్రగ్ కోరల్లో నుంచి పిల్లలను కాపాడుకోవాలి. స్కూల్‌లో టీచర్లు, ఇంటి దగ్గర తల్లిదండ్రులు పిల్లల కదలికలను డేగకన్నుతో గమనిస్తూ ఉండాలి. అప్పుడే వారికి భద్రమైన భవిష్యత్ అందించగలం.
- పిల్లలు ఎవరు ఏదీ చెబితే దానని నమ్ముతారు. వారిని అనునిత్యం కాపాడుకుంటూ ఉండాలి.



తరగతి గదిలో చంద్రబాబు, లోకేశ్, ఎంపీ తెన్నేటి



ప్రోగ్రెస్ కార్డు పరిశీలిస్తూ విద్యార్థిని, తండ్రితో మాట్లాడుతున్న చంద్రబాబు

పేరెంట్ టీచర్ మీట్ ఓ చరిత్ర..

పేరెంట్ టీచర్ మీటింగ్‌లు ఓ చరిత్రగా నిలిచిపోతాయని మంత్రి లోకేశ్ అన్నారు. ఈ సమావేశం ద్వారా పాఠశాలలో ఉన్న సమస్యలు తెలుస్తాయని, పిల్లలు ఎలా చదువుతున్నారో తల్లిదండ్రులకు సమాచారం వెళుతుందన్నారు. తమ ప్రభుత్వానికి రంగుల పిచ్చి లేదని, తాను మంత్రిని అయిన వెంటనే రంగులు తీసేయమని ఆదేశాలను జారీ చేశానని గుర్తు చేశారు. స్కూల్స్ లో జాబ్ మేళాలు తప్ప మరే ఇతర సంబంధం లేని కార్యక్రమాలు నిర్వహించకుండా చర్యలు చేపడతామన్నారు. 1 నుంచి 12 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రూ.944 కోట్లతో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్స్‌ను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం కింద లక్షలాది మంది విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులు చదువు మాత్రమే చెప్పాలని ఇతర పనులు వేటికీ వారిని వినియోగించరాదని తెలిపారు.

ఉత్సాహ పర్చేవిధంగా పోటీలు...

విద్యార్థుల తల్లిదండ్రులను ఉత్సాహ పర్చేవిధంగా హైస్కూల్‌లో పోటీలు నిర్వహించారు. చంద్రబాబు, లోకేశ్ అధికారులతో కలిసి పోటీలను తిలకించారు. క్రీడా వికాస కేంద్రంలో ఏర్పాటు చేసిన టగ్గాఫ్ వార్ పోటీలను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థుల తండ్రులు, అధికారులతో కలిసి ముఖ్యమంత్రి, లోకేశ్‌లు తాడు లాగారు. కార్యక్రమంలో ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, విద్యాశాఖ చీఫ్ సెక్రటరి కోన శశిధర్, కలెక్టర్ జె.వెంకటమురళి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌డీఏ ఆఫీసుకు ఆప్షన్ నెంబర్ 4
ఆ డిజైన్‌కు ఓటు వేసిన వారు 3354 మంది

8 **ఆత్మీయంగా.. ఆరా**
- విద్యార్థులతో సరదాగా సీఎం చంద్రబాబు
- బాపట్ల మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి ముఖాముఖి

విద్యార్థులను అంతరిక్ష పరిశోధకులుగా మార్చేది ఉపాధ్యాయులే
కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

17న ఎయిమ్స్ ప్రథమ స్నాతకోత్సవం
- హాజరుకానున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

అందుబాటులో పట్టభద్రుల ఎమ్మెల్సీ డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలు

టెక్నాలజీ హబ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం
- టెక్ కంపెనీల్లో యువతకు విస్తృత ఉద్యోగావకాశాలు
- ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ
6

ఏఎన్‌యూలో ఎల్‌ఎల్‌బీ ప్రవేశాలు

పెదకాకాని, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్ర విభాగంలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఏఎల్‌ఎల్‌బీ (ఆనర్స్), బీబీఏ ఎల్‌ఎల్‌బీ (ఆనర్స్) కోర్సుల్లో ఈ నెల 9వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ పి.బ్రహ్మాజీరావు శనివారం తెలిపారు. ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన వారు నేరుగా అడ్మిషన్ కార్యాలయానికి వచ్చి ప్రవేశాలు పొందవచ్చునని తెలిపారు. అయితే ఏపీ లాసెట్ రాసిన వారు, ర్యాంకు సాధించిన వారితోపాటు లాసెట్ రాయని వారికి కూడా ఈ ప్రవేశాలకు అర్హత కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కారు అదుపుతప్పి యువకుడి మృతి

మంగళగిరి సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రత్నాలచెరువుకు చెందిన నలుగురు యువకులు కారు సెల్ఫ్ డ్రైవ్ చేసుకుంటూ ఎంజాయ్ చేస్తున్నారు. శనివారం బైపాస్ సర్వీస్ రోడ్డులో నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేశారు. లక్ష్మీనరసింహస్వామి కాలనీ వద్ద అతి వేగంగా వస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు వెంబడి చెట్లను ఢీకొని పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో కారులోని ఓ యువకుడు మృతి చెందగా, మిగతా ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులను పరిశోధకులుగా మార్చేది ఉపాధ్యాయులే

- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని

మేడికొండూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను అంతరిక్ష పరిశోధకులుగా తీర్చి దిద్దేది ఉపాధ్యాయులేనని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. మేడికొండూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పరీక్షలు అంటే భయపడే వారిని ప్రొఫెసర్లుగా, చదువు అంటే చెమటలు పట్టే వారిని చరిత్రకారులుగా ముందుకు నడిపించగలిగే వారు ఉపాధ్యాయులేనని అన్నారు. విద్యార్థుల్లోని బలం, బలహీనతలపై దృష్టి పెట్టి, వారిలోని ప్రతిభ, కళలకు పదును పెట్టడంలో తోడ్పాటునందించాలని సూచించారు. ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు ఎంత బిజీగా ఉన్నా పిల్లల కోసం కొంత సమయం కేటాయించాలని, అప్పుడే మీ పిల్లల నడత, నడవడిక ఎలా ఉన్నాయో తెలుస్తుందన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల వేలు పట్టుకుని నడిపించినా, నడవాల్సింది మాత్రం విద్యార్థులేనని, మీ జీవితానికి నిర్మాత అయినా, మార్గదర్శి అయినా మీరే కావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్ కోసం గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను యువ నాయకుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఇందుకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు విద్యార్థుల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని, సామాజిక మాధ్యమాల మాయలో పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

95 శాతం హాజరు ఉండేలా...

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు 95 శాతం హాజరు ఉండేలా చూడాలని, సెలవు రోజుల్లో మినహా మిగతా రోజుల్లో విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలని చెప్పారు. స్కూళ్లలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, అవసరమైన చోట జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాశాఖామంత్రి రేణుకు, డీఎంఅండ్‌హెచ్‌వో విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు కందుల సిద్ధయ్య, గ్రామ సర్పంచి పూల నాగమణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. నెహ్రూ యువకేంద్ర పర్యవేక్షణలో నిర్వహించిన సైన్స్ మేళాలో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన నన్నెబోయిన లిఖితను డాక్టర్ పెమ్మసాని అభినందించి మెమెంటోను అందజేశారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలను డాక్టర్ పెమ్మసాని ప్రారంభించారు.

విద్యతోనే ప్రపంచాన్ని మార్చగలం

- నల్సార్ లా వర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావ్
- విజ్ఞాన్ వర్సిటీలో ఘనంగా ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ స్నాతకోత్సవం



ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావ్‌ను సత్కరిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు(విద్య), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ప్రపంచాన్ని మార్చగలమని హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావ్ అన్నారు. శనివారం గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ద్వితీయ స్నాతకోత్సవాన్ని వర్సిటీ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావ్ మాట్లాడుతూ జ్ఞానం యువతను గొప్ప వ్యక్తులుగా మారుస్తుందన్నారు. జ్ఞానం, నైపుణ్యాలను ఉపయోగించి సమాజానికి సేవ చేయాలన్నారు. విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ 2వ స్నాతకోత్సవం సందర్భంగా తమ యూనివర్సిటీ 860 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలల్లో మాత్రమే విద్యను అభ్యసించాల్సిన అవసరం లేదనీ, 'ఎప్పుడైనా.. ఎక్కడైనా.. ఎవరికైనా..' అనే ఆలోచనతో వచ్చిందే 'డిస్టెన్స్.. ఆన్‌లైన్ ఎడ్యుకేషన్' విధానమన్నారు. విద్య ఒక ప్రత్యేకాధికారం మాత్రమే కాకుండా సమాజానికి తిరిగి ఇవ్వాల్సిన బాధ్యతను కలిగి ఉందనే విషయాన్ని విజ్ఞాన్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య గుర్తు చేశారు. విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ వ్యక్తిగత జీవితంలో వివిధ రకాల బాధ్యతలు, ప్రతికూలతలను ఎదుర్కొంటూనే ఆన్‌లైన్‌లో డిగ్రీ కోర్సును పూర్తి చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, బోర్డు ఆఫ్ మేనేజిమెంట్ సభ్యులు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, అకడమిక్ కౌన్సిల్, ఆయా విభాగాల డీన్లు, సీడీవోఈ డైరెక్టర్లు, స్నాతకోత్సవ కన్వీనర్లు, అధిపతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అందుబాటులో పట్టభద్రుల ఎమ్మెల్సీ డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలు

విజయవాడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాలననుసరించి శాసనసభ మండలిలోని కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి చెందిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను నవంబరు 23న గుంటూరు, పల్నాడు, బాపట్ల, కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రచురించామని గుంటూరు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి తరఫున షేక్ ఖాజావలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 6 వరకు వచ్చిన క్లెయిమ్‌లను విచారించి అర్హత కలిగిన అర్జీదారులను డ్రాఫ్ట్ జాబితా నందు ఓటర్లుగా చేర్చామని ఆయన పేర్కొన్నారు. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ఓటర్ల నమోదు అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి గుంటూరు, కృష్ణా, గుంటూరు నియోజకవర్గములలోని అన్ని జిల్లాల్లోని తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ప్రజలు ఆ జాబితాను పరిశీలించుకుని అభ్యంతరాలను ఫాం 7, సవరణకు ఫాం 8, ఓటు నమోదుకు ఫాం 18 నందు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులు స్వీకరించేందుకు చివరి తేదీ డిసెంబరు 9 అని తెలిపారు. డిగ్రీ అర్హత కలిగి 2021 నవంబరు 1 లోపు డిగ్రీ పొంది ఓటరు లిస్టులో ఓటరుగా నమోదు కానటువంటి ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

టెక్నాలజీ హబ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం

- టెక్ కంపెనీల్లో యువతకు విస్తృత ఉద్యోగావకాశాలు
- ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ
- నల్లపాడు ఎంబీటీఎస్‌లో ముగిసిన రాష్ట్రస్థాయి టెక్నోఫెస్ట్



వేడుకల్లో పాల్గొన్న ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ

గుంటూరు(విద్య), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దడానికి ఎన్‌డీఏ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందనీ, ఇప్పటికే టీసీఎస్, గూగూల్ వంటి కార్పొరేట్ కంపెనీలు యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి ముందుకు వస్తున్నాయని రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ అన్నారు. నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న ప్రాంతీయ స్థాయి టెక్‌ఫెస్ట్ ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మెరుగైన సాంకేతిక విద్యను అందించడం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా ప్రముఖ కంపెనీలతో ప్రత్యేక శిక్షణ అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని, కళాశాల స్థాయిలో క్యాంపస్ ఇంటర్వ్యూల్లో రాణించేలా శిక్షణ ఉపయోగ పడుతుందన్నారు. త్వరలో విశాఖ కేంద్రంగా భారీ సంఖ్యలో ఐటీ కంపెనీలో రానున్నాయని, ఇప్పటికే టీసీఎస్, గూగూల్ కంపెనీలు రాష్ట్రంలో తమ కార్యకలాపాలు ప్రారంభిస్తున్నాయని మన్నవ మోహనకృష్ణ వెల్లడించారు. టెక్నోఫెస్ట్‌లో ఎంబీటీఎస్ కంప్యూటర్ విభాగం ఏర్పాటు చేసిన కర్షక మిత్ర ప్రాజెక్టు మొదటి బహుమతి, అమరావతి రోడ్డులోని హిందూ ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగం డిజైనర్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఐవోటి బెస్ట్‌స్మార్ట్ బ్యాక్ ఫర్ ఉమెన్ సెఫ్టీ ప్రాజెక్టు ద్వితీయ బహుమతులు గెలుచుకున్నాయని, వచ్చే ఏడాది జనవరి 6,7,8 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి ప్రదర్శనలకు మొత్తం 20 ప్రాజెక్టులు ఎంపికైయ్యాయని ప్రిన్సిపల్ టి.శేఖర్ తెలిపారు. కార్యక్రమంలో టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు, పారిశ్రామిక వేత్తలు సామినేని కోటేశ్వరరావు, సామినేని ఫణికుమార్ పాల్గొన్నారు.

కర్ణాటకపై పట్టుబిగిస్తున్న విదర్భ



కుష్ శర్మ



అన్వే ద్రవిడ్

మంగళగిరి సిటీ, డిసెంబరు 7 (ఆంధ్ర జ్యోతి): విజయ్ మర్చంట్ ట్రోఫీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో విదర్భ జట్టు లీడ్‌లో ఉంది. మూడు రోజుల ఈ మ్యాచ్‌లో విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 203 పరుగులు చేయగా, కర్ణాటక తొలి ఇన్నింగ్స్‌లో 67 ఓవర్లలో 178 పరుగులకు ఆలౌటయింది. కర్ణాటక బ్యాటర్ అన్వే ద్రవిడ్ 57 పరుగులతో రాణించాడు. విదర్భ బౌలర్ కుష్ శర్మ 21 ఓవర్లలో 27 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన విదర్భ జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 38 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి వంద పరుగులు చేసింది. కుష్ శర్మ బౌలింగ్‌తోపాటు బ్యాటింగ్‌లోనూ రాణించి 35 పరుగులతో క్రీజులో ఉన్నాడు. ఆదివారం ఆటకు ఆఖరి రోజు కాగా, విదర్భ జట్టు ఇప్పటివరకు 125 పరుగుల లీడ్‌లో ఉంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.20
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	101,109,120
చికెన్ విత్ స్కిన్	194.00
చికెన్ స్కిన్ లెస్	204.00

17న ఎయిమ్స్ ప్రథమ స్నాతకోత్సవం

- హాజరుకానున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



ఎయిమ్స్‌లో రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీశ్‌కుమార్

మంగళగిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ ప్రథమ స్నాతకోత్సవానికి సిద్ధమౌతుంది. ఈ నెల 17వ తేదీన జరిగే ఎయిమ్స్ స్నాతకోత్సవంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీశ్‌కుమార్, తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సిన్హాతో కలిసి శనివారం సాయంత్రం పరిశీలించారు. ఎయిమ్స్ ప్రవేశ మార్గం, బయటికి వెళ్లే మార్గాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రధాన ఆడిటోరియంను పరిశీలించి పాల్గొంటున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమానికి అవసరమైన పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, ఎల్ఈడీలను ముందుగానే అమర్చుకోవాలని, వాహనాల పార్కింగ్‌లో జాగ్రత్తలు వహించాలని సూచించారు. అనంతరం ఎయిమ్స్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొంటున్న ఎయిమ్స్ స్నాతకోత్సవంలో ప్రణాళికాబద్ధంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్రానికి చెందిన ముఖ్య ప్రజాప్రతినిధులు కూడా పాల్గొంటున్నందున భద్రతా పరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎయిమ్స్ డిప్యూటీ డైరెక్టర్ శశికాంత్, అకాడమీ డీన్ శ్రీమంతకుమార్ దాస్, పీఆర్వో డాక్టర్ వంశీకృష్ణ, సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్‌కే సిన్హా, డీసీహెచ్ ఎస్మయానా మజీదాబీ, ఆర్‌అండ్‌బీ ఈఈ విశ్వనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరావతి వైపు వేళ్లే బస్సులను దారి మళ్లించాలి

● బీజేపీ కిసాన్ మోర్చా నేత పాండురంగ విఠల్ సూచన

గుంటూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అమరావతి వైపునకు వెళ్లే బస్సుల రాకపోకల దారి మళ్లించాలని బీజేపీ కిసాన్ మోర్చా నాయకుడు బీ పాండు రంగ విఠల్ నగర పోలీసులకు శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అమరావతికి వెళ్లే బస్సులు నగరంలోకి రావడం వలన హిందూ కళాశాల సెంటర్ మొదలుకొని ఇన్నర్‌రింగురోడ్డు వరకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. దీని దృష్ట్యా ఆ బస్సులను ఇన్నర్ రింగురోడ్డు మీదుగా అమరావతి రోడ్డులోకి వెళ్లేలా చూడాలన్నారు. నగరంలో తూర్పు, పశ్చిమ ప్రాంతాలను కలిపే ముఖ్యమైన మార్గాలు రెండు అని, వాటిల్లో ఒకటి మూడు వంతెనలు రోడ్డు, శంకర్‌విలాస్ ఆర్‌వోబీ అని చెప్పారు. మూడు వంతెనల వద్ద పనుల కోసం రెండు వారాల నుంచి ఆ మార్గాన్ని తాత్కాలికంగా మూసి వేయడం వలన శంకర్ విలాస్ ఆర్‌వోబీ రూట్‌లో ట్రాఫిక్ తీవ్రంగా స్తంభించిపోతోందని అన్నారు. రైల్వే, మున్సిపల్ కార్పొరేషన్, పోలీసు ఉన్నతాధికారులు సమైక్యంగా చర్చించి గతంలో మూసివేసిన బ్రాడీపేట 14వ అడ్డ రోడ్డు వద్ద గల రైల్వే గేటును తాత్కాలి కంగా కొంత కాలం పాటు మళ్లీ తెరిచి ప్రజ లకు ఇబ్బంది కలగకుండా చేయాలన్నారు.


రామ్ నివాస్ గోయల్‌ను సన్మానిస్తున్న అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ వీరాంజనేయులు

అమరావతికి వస్తా

● ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ రామ్ నివాస్ గోయల్

గుంటూరు సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ బౌద్ధ క్షేత్రంగా పేరొందిన అమరావతికి త్వరలో వస్తానని ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ రామ్ నివాస్ గోయల్ హామీ ఇచ్చారు. అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు, అమ రావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు శనివారం ఆయనను ఢిల్లీ నివాసంలో కలిసి ఆహ్వానించిన నేప థ్యంలో ఆ విధంగా స్పందించారు. ప్రపంచానికి శాంతిని ప్రబోధించిన గౌతమ బుద్ధుడు నడయాడిన నేలను చూసి తరించాలన్న కోరిక తనకు ఉందని ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ అన్నట్లు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయనకు అమరావతి చరిత్ర తెలియజెప్పే పుస్తకాలు అందజేసి, చిరు సత్కారం చేసినట్లు వీరాంజనేయులు తెలిపారు.


రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్న గుంటూరు విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్

రైస్ మిల్లుపై విజిలెన్స్ దాడులు

గుంటూరు సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రేషన్ మాఫియాకు కళ్లెం వేసేందుకు గుంటూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడుల్లో దూకుడు పెంచారు. గుంటూరు విజిలెన్స్ ఎస్పీ పీ సూర్య శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో శుక్రవారం అర్ధరాత్రి చుండూరు మండలం నడిగడ్డపాలెంలోని పద్మశ్రీ రైస్ మిల్లుపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 270 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. మిల్లు యజమానిపై పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేయించారు. ఈ దాడుల్లో సీఐ చంద్రశేఖర్, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

సంపాదక ధీరుడు నార్ల వెంకటేశ్వరరావు

గుంటూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తెలుగుభాషకు, పద జాలానికి కొత్త ఒరవడిన తీర్చిదిద్ది, తెలుగు పత్రికా రంగాన్ని మలుపులు తిప్పిన అక్షర యోధుడు, సం పాదక ధీరుడు నార్ల వెంకటేశ్వరరావు అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామి రెడ్డి కీర్తించారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో నార్ల వెంకటేశ్వరరావు జయంతి కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికా సంపాదకీయాలను ఒక ఉద్యమంగా, సామాజిక సంస్కరణలకు స్ఫూర్తిగా అధికార దుర్వినియోగంపై ఎక్కుపెట్టిన బాణాలుగా ఉపయోగించారని కొనియాడారు.

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు: ఎమ్మెల్యే గళ్కా మాధవి

● ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్- టీచర్స్ మీటింగ్

● విద్యార్థుల తల్లిదండ్రులకు వినోదాత్మక కార్యక్రమాలు

గుంటూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కృషితో విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్కా మాధవి తెలిపారు. నియోజక వర్గంలోని 35వ డివిజన్ స్తంబాలగరువు, పట్టాభిపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో శనివారం ఏర్పాటు చేసిన మెగా పేరెంట్స్- టీచర్స్ మీట్‌లో ఆమె పాల్గొన్నారు. తొలుత విద్యార్థుల తల్లులకు రంగోలి పోటీలు, దండ్రులకు టగ్ ఆఫ్ వార్ వంటి వినోదాత్మక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మౌలిక వసతులు, విద్యా ప్రమాణాల ఆధా రంగా ప్రతి పాఠశాలకు 0- 5 స్టార్ రేటింగ్ ఇచ్చే కార్యక్రమాన్ని వినూత్నంగా అమలు చేయనున్నారని చెప్పారు. కార్యక్రమంలో పొడపాటి తేజస్వి, మానం శ్రీనివాస్, కార్పొరేటర్లు మానం పద్మశ్రీ, ఈరంటి వర ప్రసాద్, సింహాద్రి కనకాచారి తదితరులు పాల్గొన్నారు.

● ఆర్‌వో ప్లాంట్ ప్రారంభం

పట్టాభిపురం రవీంద్రనగర్‌లోని పీఎంసీ హైస్కూలులో ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ హైస్కూలులో అసంపూర్తిగా ఆగిపోయిన ఆర్‌వో ప్లాంటును లక్ష రూపాయలతో షెడ్డు, ప్లాంట్ నిర్మాణాలను పూర్తి చేసి విద్యార్థులకు మంచినీటి ప్లాంట్‌ను అందుబాటులోకి తెచ్చిన కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్ కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కోవెలమూడి రవీంద్ర, ఈరంటి వరప్రసాద్, పెండ్యాల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్తు కోసం : ఎమ్మెల్యే నసీర్

పిల్లల బంగారు భవిష్యత్తుకోసం తల్లిదండ్రులు ఒక అడుగు ముందుకు వేయాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ పిలుపునిచ్చారు. స్థానిక పాత గుంటూరులోని గొలుసు కొండలరావు నగర్ మున్సిపల్ స్కూల్‌లో మెగా పేరేంట్స్- టీచర్స్ మీటింగ్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారతదేశంలో గతంలో ఎన్నడూ జరగని రీతిలో ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల- ఉపాధ్యాయుల మెగా సమావేశాలు నిర్వహించిన విద్యామంత్రి నారా లోకేశ్ ఆలోచన అద్భుతమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఆట స్థలం, నాణ్యమైన విద్య అందించే ఉపాధ్యాయులు ల్యాబ్ వసతులు అన్నీ ఉంటాయని, కార్పొరేటు స్కూళ్లలో ఇరుకు గదులు తప్ప అవేవీ ఉండే పరిస్థితి లేదని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎల్లావుల అశోక్ పాల్గొన్నారు.

నూతన ఒరవడికి శ్రీకారం: జీఎంసీ కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాల ద్వారా విద్యా రంగంలో నూతన ఒరవడికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. స్థానిక రెలుపేటలోని గొలుసు నాంచారమ్మ కొండలరావు మున్సిపల్ హైస్కూల్, జలగం రామారావు మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన ఆత్మీయ సమావేశాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ సమావేశాల ద్వారా తల్లిదండ్రులు తమ పిల్లలు చదువు కునే పాఠ శాల వాతావరణం, పిల్లల ప్రోగ్రెస్‌ని నేరుగా పరిశీలిం చేందుకు వీలు కలుగుతుందని అన్నారు. అనంతరం డిప్యూటీ మేయర్ షేక్ సజిలా, తూర్పు డీఎస్పీ అబ్దుల్ అజీజ్ మాట్లాడారు. అనంతరం తల్లిదండ్రులకు, విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలిచిన వారికి ప్రశంసా పత్రాలు అందించారు. స్థానిక కార్పొరేటర్ పి.సమత, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సుధారాణి, ప్రమీలారాణి, పేరెంట్స్ కమిటి చైర్మన్లు ఫర నా, వెంక టేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బడివైపు ఒక అడుగు ముందుకు వేయాలి

గుంటూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ బడివైపు ఒక అడుగు ముందుకు వేయాలని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ కోరారు. స్థానిక నెహ్రూనగర్, బుచ్చయ్యతోటలోని మున్సిపల్ హైస్కూలులో హెచ్‌ఎం నరాల ప్రసాద్ అధ్యక్షతన మెగా పేరెంట్స్- టీచర్స్ మీటింగ్ జరిగింది. 55వ డివిజన్ అధ్యక్షుడు మేకపోతుల సోమశేఖర్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో పండుగ వాతావరణం

గుంటూరు(విద్య),డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏటీ అగ్రహారం, ఎన్జీవోకాలనీ, పట్టాభిపురం, స్తంభాలగరవు, సంజీవయ్యనగర్, గుజ్జనగుండ్ల, కెవిపికాలనీ, నల్లపాడు, వెంగళాయపాలెం, పాత బస్టాండు, పాతగుంటూరు, చౌత్రాసెంటర్, పొన్నూరురోడ్డు, తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. స్థానిక చౌత్రాసెంటర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సమగ్రశిక్ష ఏపీసీ విజయలక్ష్మి పాల్గొన్నారు. ముగ్గుల పోటీల్లో ముస్లిం మహిళలు ఉత్సాహంగా పాల్గొనడం హర్షణీయమని తెలిపారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ పివో రామారావు, హెచ్‌ఎం ఎస్‌కెఎండి ఖాసిం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్థానిక పట్టాభిపురంలోని మున్సిపల్ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే గళ్కా మాధవి పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వై వీరబాబు,ఎస్ఎంసి చైర్మన్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఏటీ అగ్రహారం ఎస్‌కెబియం స్కూల్‌లో జరిగిన వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ పాల్గొన్నారు. ౦. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, అర్బన్ ఎఎస్ఎపి హనుమంతు, ఎస్ఐ రబ్బానిఖాన్ పాల్గొన్నారు. స్థానిక బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య ఎయిడెడ్ స్కూల్‌లో పాఠశాల హెచ్‌ఎం మట్టిగుంట శారదాదేవి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో విద్యార్థినీవిద్యార్థుల తల్లిదండ్రులు అధికసంఖ్యలో పాల్గొ న్నారు. తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించినట్లు పాఠశాల కార్యదర్శి మాజేటి రాంప్రసాద్ తెలిపారు. స్థానిక ఏటుకూరు జడ్పీస్కూల్‌లో జరిగిన వేడుకల్లో అదనపు ఎస్పీ రమణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన దాతలు ఉగ్గిరాల సీతారామయ్య,కార్పొరేటర్ దాసరి లక్ష్మీ, హెచ్‌ఎం, వై వాణి, విద్యాకమిటీ చైర్మన్ శివాలశెట్టి రోజా, ఉపాధ్యాయులు కె బసవలింగారావు, పూర్ణచంద్రయ్య,రత్తయ్య,చిరంజీవి, అమరనాథ్, పోతల రాము, అంకమ్మ రావు, మార్కండేయులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న విద్యార్థినులు


విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే నసీర్


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కమిషనర్ శ్రీనివాసులు


ఎస్‌కేబీఎం విద్యార్థులతో ఎపిటెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ


ఏటుకూరు జడ్పీ స్కూల్‌లో ముగ్గుల వేస్తున్న విద్యార్థిని తల్లి

క్రిష్టియన్ భవన్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి

● కలెక్టర్ నాగలక్ష్మి


అడవి తక్కెళ్లపాడులో నిర్మాణం జరుగుతున్న క్రిష్టియన్ భవన్‌ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగర శివారులో జరుగుతున్న ఏపీ క్రిష్టియన్ భవన్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. అడవి తక్కెళ్లపాడు టిడ్కో గృహాల సమీపంలో నిర్మాణంలో వున్న క్రిస్టియన్ భవనాన్ని శనివారం ఆమె సందర్శించారు. భవనం మొదటి అంతస్తులో నిర్మాణం పూర్తి అయిన భోజనశాల, కాన్ఫరెన్స్‌హాల్, ఆఫీసు రూం, కారిడార్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు సంబంధిత అధికారులు క్రిష్టియన్ భవన నిర్మాణ పురోగతిపై వివరించారు. రెండు ఎకరాల స్థలం టీడీపీ ప్రభుత్వ హయాంలో కేటాయించడం జరిగిందని, దీనిలో 0.9 ఎకరాల్లో రూ. 10 కోట్ల అంచనా వ్యయంతో తొలి దశ భవన నిర్మాణాన్ని ప్రారంభించడం జరిగిందని, సెల్లార్, మొదటి అంతస్తులో భోజనశాల పూర్తి అయినట్లు తెలిపారు. ప్రహరీ నిర్మాణం, ఆవరణ ఫ్లోరింగ్ ఏర్పాటు చేయాలని, రెండవ అంతస్తులో ప్రధాన సమావేశ మందిరాన్ని నిర్మించాల్సి వుందని కలెక్టర్‌కు వివరించారు. ఇంకా చేపట్టాల్సిన నిర్మాణ పనులకు సంబంధించి పూర్తి స్థాయిలో నివేదిక అందిం చాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కే శ్రీనివాసరావు, గుంటూరు పశ్చిమ మండల తహశీల్దార్ వెంకటేశ్వర్లు, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి మాబూ షరీఫ్, డిఈ భాను ప్రకాష్, క్రిస్టియన్ మైనారిటీ సమన్వయకర్త ఎన్నయ్య , పాస్టర్లు ఏలీషా, ప్రకాష్ పాల్గొన్నారు.

సస్పెన్షన్‌లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ గుండెపోటుతో మృతి


గౌస్ మొహిద్దీన్ (ఫైల్)

గుంటూరు, డిసెంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : రౌడీ షీటర్ బోరుగడ్డ అనిల్‌కు అరం డల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో రాచమర్యాదలు చేసిన ఘటనలో విషాదం చోటు చేసుకుంది. రాచమర్యాదల ఆరోపణలకు సంబంధించి గత నెల 13న ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లను, మరో కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసిన విషయం విదితమే. సస్పెండ్ కు గురైన నలుగురిలో ఒకరైన హెడ్ కానిస్టేబుల్ గౌస్ మొహిద్దిన్(58) శుక్రవారం రాత్రి మృతి చెందారు. స్థానిక పాత గుంటూరులో నివాసం ఉంటున్న గౌస్ మొహిద్దీన్ కొన్ని సంవత్సరాలుగా ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడు తున్నారు. మొహిద్దీన్ మృతదేహాన్ని ఆయన స్వగ్రామం నకరికలుకు తరలించారు. బోరుగడ్డ విషయంలో ఆయనను సస్పెండ్ చేయడంతో తీవ్ర మనసా పానికి గురయ్యారు. తాను ఎటువంటి తప్పు చేయలేదని అయినప్పటికీ అన్యాయంగా తనపై సస్పెన్షన్ విధించారని గౌస్ మొద్దీన్ బాధపడుతూ ఉండేవాడని తోటి సిబ్బంది వాపోయారు. ఆరోజు రాత్రి తాను సెక్షన్ ఇన్‌చార్జిగా ఉండడంతో నైట్ రౌండ్స్‌కు బయటకు వెళ్లానని, దీంతో స్టేషన్‌లో ఏమి జరిగిందో తనకు తెలియదని, ఆ కారణంగా తనపై సస్పెన్షన్ వేటు విధించారని మొహిద్దిన్ తన సహచర సిబ్బంది వద్ద కన్నీరు పెట్టుకున్నట్లు వారు తెలిపారు. గతంలో ఆయన లాలాపేట స్టేషన్‌లో విధులు నిర్వహించారు. గౌస్ మొహిద్దిన్‌మరణం పోలీస్ శాఖలో చర్చనీయాంశమైంది. గౌస్ మొహిద్దీన్ మృతిపై అరండల్‌పేట సీఐ వీరాస్వామి, సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

విద్యుదాఘాతంతో పశ్చిమబెంగాల్ యువకుడి మృతి

పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన యువకుడు విద్యుత్ షాక్‌కు గురైన ఘటనపై అరండల్ పేట పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదు అయింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని నదియా జిల్లా నవదీప్ మండలం నిమాయి నగర్ కు చెందిన బికాస్ నాథ్ (30) వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట వద్ద ఉన్న కొత్త మాసు టెంట్ హౌస్ లో పనిచేస్తున్నాడు. ఈ నెల 5న స్థానిక అరండల్‌పేట 7/1 లో రామచంద్ర బ్రదర్స్ షోరూమ్ వద్ద అయ్యప్ప పడిపూజ కోసం ఏర్పాట్లు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు ఇనుపరాడు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. వెంటనే ఆయనను తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు అప్పటినుంచి మృతదేహాని జీజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. కాగా, శనివారం మృతుడి అక్క రింకు దేవ్ ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ కస్టడీలో రౌడీషీటర్ హరికృష్ణా రెడ్డి

సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన కేసులో నిందితుడైన రౌడీ షీటర్ కల్లం హరికృష్ణారెడ్డిని పోలీస్ కస్టడీకి లాలాపేట పోలీసులు రెండు రోజుల క్రితం తీసుకున్నారు. ఎంత విచారించినా నిందితుడు ఈ కేసుకు సంబంధించిన వివరాలు చెప్పలేదు. సోమవారం సాయంత్రం తిరిగి ఆయనను కోర్టులో హాజరు పరచనున్నారు.

విశ్రాంత కానిస్టేబుల్ అదృశ్యం

స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్రాడీపేట 5/20కు చెందిన విశ్రాంత కానిస్టేబుల్ అదృశ్యమయ్యాడు. ఆయన 2007లో ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి ఇంటికి సరిగా వచ్చేవాడు కాదు. ఈ క్రమంలో 2019లో ఎక్కడికో వెళ్లి అప్పటి నుంచి తిరిగిరాలేదు. భార్య సరోజిని ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ రహదారిపై తృటిలో తప్పిన ఘోర ప్రమాదం



నేషనల్ హైవే 16 పై లాలుపురం సబ్‌వే దగ్గర శుక్రవారం ఘోర రోడ్డు ప్రమా దం తృటిలో తప్పింది. చిలకలూరిపేట వైపు నుండి నల్లచెరువు వస్తున్న కారు అతివేగం వల్ల అదుపుతప్పి ముందు వెళ్తున్న కారును ఢీకొట్టింది. ఆ కారు డివైడర్ దాటి విజయవాడ నుండి చిలకలూరిపేట వెళ్తున్న ఇన్నోవా వాహనాన్ని ఢీ కొట్టింది. మొదటి కారులో ఉన్న ముగ్గురు పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన వారిని 108లో జీజీహెచ్‌కు తరలించారు.

జగనన్న ఇళ్ల పట్టాల పథకంలో దోపిడీ: ధారూ నాయక్

గుంటూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో ఇళ్ల స్థలాల పేరుతో జరిగిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావు, పెద్ద ఎత్తున దోపిడీ జరిగిందని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారూనాయక్ ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అక్కరకు రాని భూములను అడ్డగోలు ధరలకు కొనుగోలు చేసి.. వైసీపీ నేతలకు కోట్ల రూపాయిల దోచుకున్నారని ఆరోపించారు. ఎకరం పది లక్షలు కూడా పలకని భూములను ఐదారు కోట్లకు కొన్నారన్నారు. వైసీపీ కార్యకర్తలు, నేతల బినామీల పేరుతో భారీగా ఇళ్ల పట్టాలు కేటాయించారని ఆరోపించారు.

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేయండి

● జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు


ఖాళీ స్థలాలను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో నివాసాల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాల యజమానులకు నోటీ సులు ఇవ్వాలని, స్పందించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులు, శానిటేషన్ కార్యదర్శులకు స్పష్టం చేశారు. స్థానిక విష్ణునగర్, సీతయ్య డొంక, కాకానిరోడ్డు, పండరీపురం తదితర ప్రాంతాల్లో శనివారం ఆయన పర్యటించారు.అభివృద్ధి, పారిశుధ్య పను లను, ఆక్యుపెన్సీ దరఖాస్తులను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నివాసాల మధ్యలో ఉండే ఖాళీ స్థలాల్లో దోమలు, వ్యాధికారక క్రిమి కీటకాలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికే పలు ఫిర్యాదులు కూడా అందాయన్నారు. వార్డు సచి వాలయాల వారీగా శానిటేషన్ కార్యదర్శులు ఖాళీ స్థల యజమానులకు స్థలం శుభ్రం చేసుకోవాలని నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. నిర్దేశిత ప్రభుత్వ నిబంధనలు పాటించని భవనాలకు ఓసీ మంజూరు చేయబోమన్నారు. ఈ పర్యటనలో కార్పొరేటర్ కె.కోటేశ్వరరావు, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీలు రెహ్మాన్, మల్లికార్జున, ఈఈ. కోటేశ్వరరావు, డీఈఈ రమేష్ బాబు, మధు సూదన్ పాల్గొన్నారు.

బకాయిలు రెండు రోజుల్లో చెల్లించకుంటే టాప్ కనెక్షన్ కట్

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో నీటి మీటర్ల బకాయిదారులు రెండు రోజుల్లో చెల్లించకుంటే ట్యాప్ కనెక్షన్ తొలగించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆస్తి, ఖాళీ స్థల పన్ను, నీటి మీటర్ల చార్జీల వసూళ్ల వేగ వంతంపై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో కమిషనర్ చాంబ ర్‌లో అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొ న్నారు. కమిషనర్ మాట్లాడుతూ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల వారీగా పన్నుల వసూళ్లు లక్ష్యానికి తగిన విధంగా లేవని అన్నారు. రాబోయే రెండు రోజుల్లో వార్డు సచివాలయాల వారీగా అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పన్ను వసూళ్లకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డీ శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ కారును అడ్డుకున్న వీధివ్యాపారులు

● ఓల్డ్ క్లబ్ రోడ్డులో సంఘటన ● ఓ మహిళా వ్యాపారి ఆత్మహత్యాయత్నం

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులకు చేదు సంఘటన ఎదురైంది. నగరంలో పెద్ద ఎత్తున రోడ్డుపై ఉన్న ఆక్రమణలు తొలగిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా స్థానిక కొత్తపేటలోని ఓల్డ్ క్లబ్ రోడ్డులో కూడా నగరంలో తొలుత రోడ్డుపై ఆక్రమణలు తొలగించారు. అయితే, వీధి వ్యాపారులు మళ్లీ తమ వ్యాపారాలు ప్రారంభించారు. వాహదారులకు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇక్కడ తరచుగా ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యపై స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం ఓల్డ్ క్లబ్ రోడ్డులోని ఆ ప్రాంతాలను సందర్శించారు. కమిషనర్ రాకను గమనించిన వీధి వ్యాపారులు మూకుమ్మడిగా ఆయన కారును అడ్డుకుని నినాదాలు చేశారు. ఆయన ఎదుట ఆందోళనక దిగారు. ఓ మహిళా వీధి వ్యాపారి తన ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటామంటూ బెదిరింపులకు దిగారు. నగరంలో వీధి వ్యాపారులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇచ్చి, జోన్లు కేటాయిస్తున్నామని, ఆ జోనులోనే వ్యాపారాలు చేసుకోవాల్సి ఉంటుందని వారికి కమిషనర్ తెలిపారు. కమిషనర్ సమయస్ఫూర్తిగా వ్యవహరించి అక్కడ నుండి వచ్చేశారు. వీధి వ్యాపారుల ఆందోళన వెనుక వైసీపీకి చెందిన ఓ కార్పొరేటర్ తెర వెనుక ఉండి నడిపించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.


పాటిబండ్ల జానకిని సత్కరిస్తున్న నిర్వాహకులు

రామకృష్ణయ్య పంతులు అవార్డు పాటిబండ్ల జానకికి ప్రదానం

గుంటూరు(తూర్పు), డిసెం బరు 7(ఆంధ్ర జ్యోతి):రామకృష్ణయ్య పంతులు మెమోరియల్ అవార్డును విశ్రాంత అధ్యాపకు రాలు పాటిబండ్ల జానకికి ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో అవార్డు ప్రదాన సభ జరిగింది. కార్యక్రమాలను పద్మశ్రీ డాక్టర్ అన్నవరపు రామస్వామి, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయ బాబు కార్యక్రమాల్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ నీలిమ హాజరయ్యారు.


ఈశ్వరరెడ్డికి పురస్కారం అందజేస్తున్న అరసం నాయకులు

ఈశ్వరరెడ్డికి తుమ్మల సాహితీ పురస్కార ప్రదానం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎల్‌బీఈడీ కళాశాల ఆవరణలో విశాలాంధ్ర పుస్తక మహోత్సవంలో ఆలూరి బైరాగి సాహిత్య వేదికపై అరసం నిర్మాత, అమరజీవి తుమ్మల వెంకటరామయ్య సాహితీ పురస్కార ప్రదాన వేడుక శనివారం ఘనంగా జరిగింది. సభకు అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యోగి వేమన విశ్వవిద్యా లయం తెలుగు అధ్యాపకుడు ఆచార్య ఎన్ ఈశ్వరరెడ్డికి ఈ పురస్కారాన్ని అంద జేశారు. అనంతరం ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ తుమ్మల వెంకటరామయ్య పేరిట నెలకొల్పిన పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వల్లూరి శివప్రసాదు, కే శరత్, బుల్లా రవి పాల్గొన్నారు.

12న పాలస్తీనా సంఘీభావ సభ

గుంటూరు(విద్య),డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న స్థానిక అరండల్‌పేటలోని వైన్ డీలర్స్ కల్యాణ మండపంలో పీడీఎస్‌వో,ఎన్‌వైఎస్ ఆధ్వర్యంలో పాలస్తీనా సంఘీభావ సభ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ భాస్కర్ వెల్లడించారు. స్థానిక ఏసీ ఏసీ కళాశాల వద్ద శనివారం పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌వో రాష్ట్ర కోశాధికారి ఎల్ భాను, ఎన్‌వైఎస్ జిల్లా నాయకులు కే శ్రీను, ఎన్‌వైఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు వీ విశ్వతేజ, రవి పాల్గొన్నారు.

వ్యవసాయ కమిషనరేట్ యూనిట్ కార్యవర్గ ఎన్నిక

గుంటూరు(తూర్పు), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక కృషి భవన్‌లో ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చరల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యవసాయ కమిషనరేట్ యూనిట్‌కు ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడుగా శాంతి స్వరూప్, కార్యదర్శిగా మణి కుమారి, కోశాధికారిగా షాబుద్దీన్, సహాధ్యక్షుడుగా అన్నం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడుగా ప్రసాదుబాబు, లోకేష్, అశ్వర్థ్ నారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సునీల్ యాదవ్, జాయింట్ సెక్రటరీలుగా సత్యనారాయణ, శ్రీహరిరావు, దూండీశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా ఎమ్ వేంకటేశ్వర రావు, వెన్నా రమేష్, డీఎస్ఎన్ శ్రీనివాస్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ అగ్రికల్చరల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయి కుమార్, రవికుమార్, శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

- విద్యార్థులతో సరదాగా సీఎం చంద్రబాబు
- ప్రతి అంశంపై స్పందించి పరిష్కారంపై స్పష్టత
- విద్యార్థులు ఆడుతూ పాడుతూ చదువుకోవాలని సూచన
- పిల్లల చదువు, వారి గోల్ తల్లిదండ్రులు తెలుసుకోవాలి
- విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మమేకం
- బాపట్ల మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి ముఖాముఖి



వేదికపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తో ఉపాధ్యాయులు

ఆత్మీయంగా ఆరా



బాపట్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల లక్ష్యమేంటో అడిగారు.. తండ్రుల ఆర్థిక పరిస్థితి తెలుసు కున్నారు.. విద్యార్థులకు వచ్చిన మార్కులపై ఆరా తీశా రు.. పిల్లల చదువునే ఆస్తిగా భావించాలని తల్లిదండ్రు లకు సూచన.. విద్యార్థుల భవిష్యత్తు మీ చేతిలోనే ఉందంటూ టీచర్లకు దిశానిర్దేశం.. బాపట్ల ఉన్నత పాఠశా లలో శనివారం జరిగిన మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ముఖ్య మంత్రి చంద్రబాబు అధికార దర్పం లేకుండా ఆత్మీ యంగా కలిసిపోయి వివిధ అంశాలపై ఆరా తీశారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులతో సీఎం మెలి గిన తీరు ఇంటి పెద్దను తలపించడంతో పాటు సొంత మనిషి తమ దగ్గరకు వచ్చి ఇబ్బందులు వింటున్నారన్న అభిప్రాయం వారిలో కనిపిం చింది. సెల్‌ఫోన్, డ్రగ్స్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించడంతో పాటు వాటి నుంచి పిల్లల్ని కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని సీఎం తెలిపారు. మొత్తంమీద ఆసక్తికరంగా.. దిశానిర్దేశం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌లు విద్యార్థులు, వారి తల్లులతో ముఖాముఖీగా మాట్లాడారు. డ్రగ్స్‌కు దూరంగా ఉందాం బ్రో... అంటూ విద్యార్థి జాన్‌ప్రకాష్ మాట్లాడిన తీరుకు ముఖ్యమంత్రి విశేషంగా స్పందించారు. ఇలా విద్యార్థులు చెప్పిన ప్రతి మాటకు ఎంతో ఓర్పుతో స్పందించి స్పష్టమైన హామీ ఇచ్చారు.



పేరెంట్-టీచర్ మీటింగ్‌లో తల్లిదండ్రులు, విద్యార్థులు

పూర్వవిద్యార్థి, విశ్రాంత ఆచార్యులు డాక్టర్ పీవీ కృష్ణయ్య: బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో అనేక మంది ప్రముఖులు విద్యనభ్యసించారు. ఇక్కడ చదివి ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అసోసియేట్ డీన్‌గా పనిచేశాను.

ముఖ్యమంత్రి: అనేకమంది ఉన్నత స్థాయికి ఎదగడానికి విలువలతో కూడిన విద్యను అందుకోవడమే ప్రధానం. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తాను.

విద్యార్థిని షేక్.భాను: మా పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ లేవు. వాటిని ఏర్పాటు చేయాలి.

ముఖ్యమంత్రి: హైస్కూల్‌లో కంప్యూటర్ ల్యాబ్‌లు, లైబ్రరీ ఏర్పాటుకు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ కృషి చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలలో వీటిని ఏర్పాటు చేసే బాధ్యత మంత్రి నారా లోకేశ్ తీసుకుంటారు.

విద్యార్థి పి.సంతోష్: పాఠశాలలో క్రీడలకు సంబంధించిన గ్రౌండ్ అభివృద్ధి చేసి ఇండోర్ స్టేడియలో షటిల్ ఆడుకునే అవకాశం కల్పించాలి. క్రీడా సామగ్రి ఏర్పాటు చేయాలి.

ముఖ్యమంత్రి: పాఠశాలలో క్రీడా ప్రాంగణం అభివృద్ధి చేస్తాం. విద్యార్థులు ఆడుతూ పాడుతూ చదువుకునే విధంగా చేస్తాం. కేవలం చదువులకే పరిమితం కాకుండా ఆటలతో కూడిన చదువు వల్ల విద్యార్థులు ఆనందంగా, ఇష్టంగా చదువుకుంటారు.

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు ఎన్.హేమమాలిని: పాఠశాలలో ఏడేళ్ల క్రితం భవనం నిర్మించి పూర్తి చేయకుండా వదిలేశారు. భవనాన్ని పూర్తి చేయించి ప్రారంభించేలా ముఖ్యమంత్రి చొరవ చూపాలి. ఇక్కడ చదువుకునే విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలి.

ముఖ్యమంత్రి: వచ్చే జూన్ నాటికి భవనం నిర్మాణం పూర్తి చేసి కొత్త భవనంలోనే తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం.

ఉపాధ్యాయుడు కోటేశ్వరరావు: నానాటికి మానవ సంబంధాలు తరిగిపోతున్నాయి. విద్యార్థులు తోటి విద్యార్థులు, ఉపాధ్యాయుల పట్ల అనుసరిస్తున్న విధానం సరిగాలేదు. పాఠ్యాంశాలలో నైతిక విలువలు పెంపొందించే పాఠాలు ఏర్పాటు చేయాలి.

ముఖ్యమంత్రి: నైతిక విలువలు చాలా ముఖ్యం. వీటిని పెంచేందుకు ప్రభుత్వం తరపున కౌన్సెలింగ్ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తాం. వారసత్వ సంపద భవిష్యత్ తరాలకు అందించేలా కృషి చేస్తాం. కెరీర్ గైడెన్స్‌పై చాగంటి కోటేశ్వరరావు ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తాం.

సెల్‌ఫోన్‌తో నష్టం

విద్యార్థిని పి.జోత్స్న: సెల్‌ఫోన్ల వినియోగం వల్ల విద్యార్థులు అనేక విధాలుగా నష్టపోతున్నారు. దీనివల్ల చదువులో వెనుకబడిపోతున్నారు. సైబర్ నేరాలు కూడా పెరిగిపోతున్నాయి. ప్రతి విద్యార్థి సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌ట్యాప్‌లకు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధపెడితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు.



సీఎం చంద్రబాబు: నేడు సమాజంలో సైబర్ నేరాలు పెద్ద సవాల్‌గా మారాయి. దీనిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. విద్యార్థులు సాధ్యమైనంత వరకు సెల్‌ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌ల వినియోగాన్ని తగ్గించాలి. దీనికి తల్లిదండ్రుల సహకారం కూడా అవసరం.

ఉపాధి కోర్సులు కావాలి

విద్యార్థి అఖిల్ తల్లి కూచిపూడి ఝాన్సీరాణి: పాఠశాలలో ఉపాధి అవకాశాలు కల్పించే కోర్సులు ఏర్పాటు చేయాలి. కెరీర్ గైడెన్స్ ఇవ్వడం వల్ల వారికి మంచి భవిష్యత్ ఉంటుంది. పాఠశాలలో అలాంటి కార్యక్రమాలు నిర్వహించాలి.

ముఖ్యమంత్రి: ప్రతి ఇంటిలో ఒక పారిశ్రామికవేత్త రావాలి అలాంటి ఆలోచనలు ప్రతి ఒక్కరికి కలగాలనేది నా ఆకాంక్ష. ఆ దిశగా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతి ఒక్కరి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తాం. విద్యార్థులతో తల్లిదండ్రులు ప్రతిరోజు మాట్లాడి వారు ఏమి చదవాలి, గోల్ ఏమిటి అనేది తెలుసుకోవాలి.





డ్రగ్స్ వద్దు బ్రో..

విద్యార్థి జాన్‌ప్రకాష్: డ్రగ్స్‌కు దూరంగా ఉందాం బ్రో. నానాటికి మత్తుపదార్థాలు వినియోగిస్తూ విద్యార్థులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. చెడు స్నేహాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి.

సీఎం: ఇళ్ల దగ్గరే గంజాయి మొక్కలు పెంచే పరిస్థితి వచ్చింది. దీనిని సమూలంగా అరికట్టేందుకు ఈగల్ పేరుతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ తీసుకువచ్చాం. తనిఖీలు చేపట్టి మత్తుపదార్థాలు వినియోగించకుండా, విక్రయించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. తల్లిదండ్రులు కూడా పిల్లలు చేసే పనులను గమనిస్తూ ఉండాలి. ఎప్పటికప్పుడు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి వ్యసనాలకు దూరంగా ఉంచి భవిష్యత్‌కు ఉపయోగపడే కార్యక్రమాలు నేర్పించాలి. పిల్లల పనితీరుపై డేగకన్ను వేయాలి. లేకుంటే వారు నిజమైన తల్లిదండ్రులు కాదు. అన్ని జాగ్రత్తలు తీసుకుంటే తద్వారా స్వర్ణాంధ్రప్రదేశ్ సాధ్యమౌతుంది. అదే నా ఆకాంక్ష.

జవాన్ల కుటుంబాలకు అండగా నిలుద్దాం

- కలెక్టర్ నాగలక్ష్మి పిలుపు

గుంటూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా మనం అందించే సహాయం దేశ రక్షణలో అశువులు బాసిన వీర జవానుల కుటుంబ సంక్షేమం, పునరావాసానికి ఎంతగానో దోహద పడుతుందని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో శనివారం ఉదయం ఫ్లాగ్ డే సందర్భంగా నిర్వహించిన సాయుధ దళాల పతాక దినోత్సవ విరాళాల కార్య క్రమాన్ని ఆమె ప్రారంభించారు. కలెక్టర్ ప్రప్రథమ విరాళాన్ని హుండీ బాక్స్‌లో వేసి ప్రారంభించారు. డీఆర్‌ఓ ఎన్ షేక్ ఖాజావలి, గుంటూరు ఆర్‌డీవో కే శ్రీనివాసరావులు ఈ సందర్భంగా విరాళాలు అందించారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సైనికులు విధులను నెరవేర్చేందుకు తమ జీవితంలో ఎన్నో త్యాగాలు చేస్తారని కొనియాడారు. సరిహద్దులను రక్షించడం ద్వారా దేశ, గౌరవం, భద్రతను కాపాడిన సైనికులకు, మాతృభూమి సేవలో తమ ప్రాణాలను అర్పించిన వీర జవాన్లకు దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందన్నారు. దేశ రక్షణతో పాటు అంతర్గతంగా జరిగే అనేక విపత్కర పరిస్థితులను చక్కదిద్దడంలో సైనికులు కీలక పాత్ర పోషిస్తారన్నారు. యుద్ధం వలన వికలాంగులైన సైనికులు, వితంతువులు దేశం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరుల కుటుంబాల సంక్షేమం కోసం విరివిగా విరాళాలు అందించి తమ వంతు సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. విరాళాలు సేకరించే ప్రక్రియలో భాగంగా రూపొందించిన ప్రచార పోస్టర్లను సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజతో కలిసి ఆమె ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుడు హవల్దార్ పొరధి రెడ్డి(శౌర్య చక్ర) భార్య బుడ్డపు వెంకట లక్ష్మి, సిపాయి సీ వాసు కిషోర్ భార్య నవీనలను కలెక్టర్ సన్మానించారు. వెంకట లక్ష్మికి ఏటుకూరు గ్రామంలో 300 చదరపు గజాల ఇంటి స్థలం పట్టాను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారిణి ఆర్ గుణ శీల, జిల్లా సైనిక సంక్షేమ శాఖ కార్యాలయ పర్యవేక్షకుడు ఆనంద రావు, మాజీ సైనికుల ప్రతినిధులు నరసింహులు, రామిరెడ్డి పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో సాయుధ దళాల పతాక దినోత్సవ విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

- 10 డిజైన్ల ఓటింగ్‌లో పాల్గొన్న 9756 మంది
- ఆప్షన్ - 4 డిజైన్‌కు ఓటు వేసిన వారు 3354 మంది
- రెండో స్థానంలో నిలిచిన ఆప్షన్ - 10, మూడో స్థానంలో ఆప్షన్ - 8





సీఆర్‌డీఏ ఆఫీసుకు ఆప్షన్ నెంబర్ 4

తుళ్లూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ఏపీసీఆర్‌డీఏ ప్రాజెక్టు బిల్డింగ్ డిజైన్లకు నిర్వహించిన పోలింగ్‌కు అనూహ్య స్పందన వచ్చింది. 10 డిజైన్లను ఇటీవలే వెబ్‌సైట్‌లో ఉంచి నచ్చిన డిజైన్‌ను ఎంపిక చేయాల్సిందిగా సీఆర్‌డీఏ అధికారులు ప్రజాభిప్రాయాన్ని కోరిన సంగతి తెలిసిందే. దీనికి వారం రోజులు గడువు నిర్దేశించారు. గడువు పూర్తి కావటంతో ప్రజాభిప్రాయాన్ని సీఆర్‌డీఏ అధికారులు శనివారం వెల్లడించారు. మొత్తం 9756 మంది డిజైన్ల ఎంపికలో పాల్గొన్నారు. అత్యధికంగా ఆప్షన్ - 4 డిజైన్‌కు ప్రజలు ఓటు వేశారు. ఆప్షన్ - 4 కు అత్యధికంగా 3,354 మంది ఓటు వేశారు. పోలైన మొత్తం ఓట్లలో 34.36 శాతం మేర ఆప్షన్ - 4 కే మొగ్గు చూపటం విశేషం. ఆప్షన్ - 10 డిజైన్ రెండో స్థానంలో నిలిచింది. ఆప్షన్ - 10 డిజైన్‌కు 3,279 ఓట్లు వచ్చాయి. ఆప్షన్ - 10కి కూడా దగ్గర దగ్గరగా 33.61 శాతం మేర ఓట్లు పడటం విశేషం. ఈ రెండు డిజైన్ల మధ్యన చాలా దగ్గర పోటీ నెలకొంది. ఆప్షన్ - 8 డిజైన్‌కు 1669 ఓట్లు వచ్చాయి. ఆప్షన్ - 8 మూడవ స్థానంలో నిలిచింది. ఇక వరుసగా చూస్తే నాల్గవ స్థానంలో ఆప్షన్ - 3, ఐదవ స్థానంలో ఆప్షన్ - 6, ఆరవ స్థానంలో ఆప్షన్ - 1, ఏడవ స్థానంలో ఆప్షన్ నెంబర్ - 7, ఎనిమిదవ స్థానంలో ఆప్షన్ - 9, తొమ్మిదవ స్థానంలో ఆప్షన్ - 2, పదవ స్థానంలో ఆప్షన్ - 5లు నిలిచాయి.

- రతన్‌టాటా ప్రేరణతో నానో కారులో ప్రయాణం
- తాడేపల్లికి విచ్చేసిన శాంతి యాత్రికుడు ఎస్ఎన్ సంకల్ప్

శాంతి యాత్రికుడు సంకల్ప్

తాడేపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలు శాంతితో ఉంటే దేశ అభివృద్ధి సాధ్యమని.. యువత, విద్యార్థులు ప్రజల్లో మార్పు కోసంగా.. రతన్‌టాటా ప్రేరణతో.. నాగపూర్‌కు చెందిన ఎస్ఎన్ సంకల్ప్ భారతయాత్రకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది అక్టోబర్ 17న నాగపూర్‌లో నానో కారులో సంకల్పయాత్ర ప్రారంభం కాగా శనివారం తాడేపల్లికి చేరుకుంది. కుంచనపల్లి అరవింద హైస్కూల్ విద్యార్థులతో ముఖాముఖి అనంతరం ఆయన ఆంధ్రజ్యోతితో సంకల్ప్ గురించి ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలిలా ఉన్నాయి..



నానో కారుతో సంకల్ప్

యాత్ర ఎందుకంటే..

ప్రతి ఒక్కరూ శాంతితో ఉండాలని ప్రకృతిని నాశనం చేయకుండా, చెట్లను సంరక్షించాలి. కళలు, డ్రాయింగ్ ద్వారా మానవునికి కొంత ప్రశాంతత లభిస్తుంది. ధ్యానంతో మంచి ఆరోగ్యం సిద్ధిస్తుంది. ప్రతి ఒక్కరూ శాంతితో ఉంటే ఇబ్బందులు ఉండవని, మానసిక ప్రశాంతత ఉంటే ప్రతి ఒక్కరి అభివృద్ధి సాధ్యం. కోపం, అశాంతి అభివృద్ధి నిరోధకాలు. యువతకు పీస్ ఆఫ్ మైండ్ ఉండాలి. ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి. విద్యార్థులకు ఫైన్‌ఆర్ట్స్ వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుంది. డబ్బుతో ప్రశాంతతను కొనలేము. ఈ అంశాలపై విద్యార్థులను, ప్రజలను ప్రభావితం చేయాలనే తపనతో భారతయాత్రకు శ్రీకారం చుట్టాను. యాన్ ఆర్టిస్ట్ ట్రావెలింగ్ ఆలిండియా బై నానో కార్ ఫర్ పీస్, నేచర్, ఆర్ట్ అండ్ మెడిటేషన్ ట్యాగ్‌తో ప్రయాణం చేస్తున్నాను.

సంకల్పమిది..

మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన నేను 2009లో బ్యాచలర్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ (బీఎఫ్‌ఏ)లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశా. మైత్రేయి గ్లోబల్ ఆన్‌లైన్ ఆర్ట్ అకాడమీ స్థాపించి ఫైన్‌ఆర్ట్స్‌లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చాను. ఆర్టిస్ట్‌గా వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా ఆధ్యాత్మిక సలహాదారుగా, రచయితగా, ఫైన్‌ఆర్ట్స్ ఉపాధ్యాయుడిగా కొనసాగుతూ దేశంలో విద్యార్థులు, యువత, ప్రజలు శాంతితో ఉంటే దేశ అభివృద్ధి సాధ్యమనే భావనతో భారత్‌యాత్ర చేపట్టాను. పారిశ్రామిక దిగ్గజమైనా నిత్యం పేదలు, మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేసిన రతన్ టాటా ప్రేరణతో ఆయన ప్రవేశపెట్టిన నానో కారులో శాంతి కోసం మంచి ప్రకృతి ఉండాలనే లక్ష్యంతో యాత్ర చేస్తున్నాను. కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, శాంతి, ప్రకృతి, ఆరోగ్యం అంశాలపై అవగాహన కల్పిస్తూ యాత్ర సాగిస్తున్నాను.

టాటా జీవితం ఆదర్శం

ప్రజలకోసం తపన పడే ఏకైక మనసున్న పారిశ్రామికవేత్త రతన్ టాటా భావాలు, వ్యక్తిత్వం, నిజాయితీతో కూడిన జీవితం ప్రతిఒక్కరికీ ఆదర్శనీయం. అందుకే ఆయన అందుబాటులోకి తెచ్చిన నానో కారులోనే దేశాన్ని చుట్టి రావాలనే ప్రేరణ కలిగింది. ప్రయాణంలో రహదారి పక్కన ఉన్న పాఠశాలలు, పీహెచ్‌సీలు, రెస్ట్ ఏరియా ల్లోనే కారులో విశ్రాంతి తీసుకుంటా. కారు లోనే చిన్న గ్యాస్ సిలిండర్, స్టవ్ వంటపదార్థాలు పెట్టుకుని వండుకుని భోజనం చేస్తాను.

ఫ్లెమింగ్ పక్షి స్ఫూర్తి..

యాత్రకు చైనీస్ ట్రావెలర్ జుయాంగ్ చాంగ్, శ్రీలంకకు చెందిన నయానిక్ ధర్మపాల్ మాంక్ ఆదర్శం. అమెరికా నుంచి భారత్‌కు ఫ్లెమింగ్ బర్డ్‌కు వస్తుంది. ఆ పక్షి స్ఫూర్తితో యాత్రకు శ్రీకారం చుట్టాను. ఆరు నెలల్లో యాత్ర సాగుతుందని, ముంబాయి చేరికతో ముగుస్తుంది. పెయింటింగ్‌ల విక్రయం, బోధనల ద్వారా వచ్చే నగదును ఖర్చులకు ఉపయోగించుకుంటున్నాను.



విద్యార్థులకు బోధన చేస్తున్న సంకల్ప్

అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు

ల్యాండ్ ప్రొక్యూర్‌మెంట్ ఆర్‌ఎఫ్‌పీ గడువు పొడిగింపు

విజయవాడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్)కు సంబంధించి ల్యాండ్ ప్రొక్యూర్‌మెంట్ మంచి మోడల్‌ను ఇచ్చేందుకు వీలుగా ఆర్‌ఎఫ్‌పీ విడుదల చేసిన సీఆర్‌డీఏ అధికారులు మరోమారు దీని గడువును పెంచారు. బిడ్డర్ల నుంచి సాంకేతికపరమైన అంశాలపై సందేహాలు వ్యక్తమైన నేపథ్యంలో గడువును డిసెంబరు 20 వరకు పొడిగించారు.

తెలుగు నాటకరంగ శిల్పి కేఎస్‌టీ శాయి

ఏపీ నాటక అకాడమి చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ



పుస్తకావిష్కరణ చేస్తున్న ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమి చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ తదితరులు

బాపట్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలుగు నాటక రంగ చరిత్రలో సువర్ణ అధ్యాయాలు లిఖించిన నాటకరంగ నిర్మాణ శిల్పి కేఎస్‌టీ శాయి అని ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమి చైర్మన్ కళారత్న గుమ్మడి గోపాలకృష్ణ తెలిపారు. చరిత్ర పరిశోధకుడు మన్నె శ్రీనివాసరావు రచించిన నవరస నాట్య కళానిధి కేఎస్‌టీ శాయి అనే గ్రంథాన్ని బాపట్ల రోటరీకల్యాణ మండపంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుమ్మడి మాట్లాడుతూ శాయి జీవిత చరిత్రను విశ్లేషణాత్మకంగా, పరిశోధనాత్మకంగా రచించడం భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ఏఎస్పీ విఠలేశ్వర్ మాట్లాడుతూ మహనీయుల చరిత్ర సామాజికులకు దిశ, నిర్దేశం చేసే దీపస్తంభంలాంటిదన్నారు. చైతన్య విద్యాసంస్థల ఏజీఎమ్ ఈమని దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర వికాసానికి లలితకళలు, నాటకకళ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారుడు యార్లగడ్డ సత్యనారాయణ, సినీ రచయత బుర్రా సాయిమాధవ్, కొత్తపల్లి శ్రీనివాసరావు, వంకాయలపాటి హరిబాబు, డాక్టర్ రావూరి వీరరాఘవయ్య, మట్టా రాజా, వెంకటరామప్రసాద్, ఆకురాతి మురళీకృష్ణ, వై.ఎస్.కృష్ణేశ్వరరావు, అంబటి మురళీకృష్ణ, సంకా వెంకటరామ్‌కుమార్, భాగి కృష్ణమూర్తి, బందాబాబు పాల్గొన్నారు.

రేపటితో ముగియనున్న ఓట్ల నమోదు ప్రక్రియ

తాడికొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గుంటూరు-కృష్ణా జిల్లాల ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓట్ల నమోదు ప్రక్రియ ఈనెల 9వ తేదీతో ముగుస్తుందని అసిస్టెంట్ ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి కే నాసరయ్య శనివారం తెలిపారు. డిసెంబరు 6వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తులను విచారించి ఓటర్ల జాబితాలో చేర్చటం జరిగిందన్నారు. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను ఫారం-7 ద్వారా, సవరణ కొరకు ఫారం 8 ద్వారా, ఓటు నమోదు కొరకు ఫారం 18 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. కొత్తగా ఓటు నమోదు చేసుకోవటానికి 9వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వడ్డేశ్వరంలో కార్డెన్ సెర్చ్

తాడేపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలో శనివారం రాత్రి లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ రవి కుమార్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని విద్యార్థుల వసతి గృహాలకు, హాస్టల్స్‌కు వెళ్లి గదులు తనిఖీ చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు, డ్రగ్స్ వాడుక వంటి వాటికి పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. విద్యార్థులు సత్ప్రవర్తనతో ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మురళీకృష్ణ, సీఐలు కళ్యాణ్‌రాజు, నజీర్‌బేగ్, ఎస్ఐలు కోటయ్య, శ్రీనివాసరావు, 100 మంది సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ కస్టడీలో రౌడీషీటర్ హరికృష్ణారెడ్డి

గుంటూరు, 7(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన కేసులో నిందితుడైన రౌడీ షీటర్ కల్లం హరికృష్ణారెడ్డిని పోలీస్ కస్టడీకి లాలాపేట పోలీసులు రెండు రోజుల క్రితం తీసుకున్నారు. ఎంత విచారించినా హరికృష్ణారెడ్డి కేసుకు సంబంధించిన వివరాలు చెప్పలేదు. సోమవారం సాయంత్రం తిరిగి ఆయనను కోర్టులో హాజరు పరచనున్నారు.


వీఐటీలో రక్తదాన శిబిరం

తుళ్లూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : వీఐటీ (వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)లో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. వ్యవస్థాపకులు జీ విశ్వనాథన్ 86వ జన్మదినం సందర్భంగా గుంటూరు ప్రభుత్వాస్పత్రి సహకారంతో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అలాగే వీఐటీ దత్తత గ్రామాలైన శాఖమూరు, ఐనవోలు, వెలగపూడి గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు అవసరమైన క్రీడా సామగ్రి, స్టేషనరీ, స్కూల్ బ్యాగ్స్ అందించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ యశస్వి రమణ, రిజిస్ట్రార్ జగదీష్‌చంద్ర ముదిగంటి, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగో రోజుకు చేరిన కార్మికుల దీక్షలు

తాడేపల్లి టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తమకు రావలసిన న్యాయమైన బకాయిల కోసం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శనివారంతో 4వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను కాంగ్రెస్ మహిళా విభాగం నాయకురాలు ఎస్కే మున్ని ప్రారంభించారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఎస్కె సలీం మాట్లాడుతూ కార్మికుల పోరాటానికి కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతునిస్తుందన్నారు. అవసరమైతే రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను కూడా పిలిపిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత దర్శనపు శామ్యూల్, పూర్ణచంద్రరావు, సుభాని, కుమార్, సీఐటీయూ నేతలు వేముల దుర్గారావు, కూరపాటి స్టీవెన్, అంకయ్య, ఆశీర్వాదం పాల్గొన్నారు. దీక్షల్లో రమాదేవి, దుర్గాభవాని, శారమ్మ, రమణ, సీత కూర్చున్నారు.

నిర్మలలో ఘనంగా క్రీడా దినోత్సవం



క్రీడా దినోత్సవంలో పాల్గొన్న కరస్పాండెంట్ జాన్‌పాల్, ఉపాధ్యాయులు

మంగళగిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు నిర్మల ఇంగ్లిష మీడియం పాఠశాలలో శనివారం నిర్మల మాత ఇనిస్టిట్యూట్ డే, కిండర్ గార్డెన్స్ క్రీడా దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ జాన్‌పాల్, ప్రిన్సిపాల్ జ్ఞానసుందరిలు మేరీమాత విగ్రహానికి పూలమాల వేసి క్రీడా దినోత్సవాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు పరుగు పందెం, మ్యూజికల్ చైర్స్, డక్‌వాక్, స్టిక్ దవాల్ వంటి పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. జాన్‌పాల్ మాట్లాడుతూ మేరీమాత వలె ప్రతిఒక్కరూ దయ, మానవత్వం, పవిత్రత, ఉన్నత విలువలు కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్య మన భవిష్యత్తు

● మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాల్లో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



ప్రత్తిపాడు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



మంగళగిరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ

ప్రత్తిపాడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్య ఒక పాఠం కాదు.. మన భవిష్యత్తు అని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు విద్యార్థులకు సూచించారు. ప్రత్తిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూర్ల మాట్లాడుతూ విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలిఫైడ్ టీచర్లతో విద్యాబోధన జరుగుతుందన్నారు. ఐఏఎస్‌లు ఎక్కువ మంది ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని వచ్చిన వారే అన్న సంగతిని గుర్తుంచు కోవాలన్నారు.

ఎండీఎం పథకానికి కమిటీలు

మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి నియోజవర్గ స్థాయిలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే రామాంజనేయులు తెలిపారు. ప్రభుత్వం అందించే సొమ్ముకు మన వంతు సాయంగా దాతలు చేయూత అందిస్తే దాని ద్వారా విద్యార్థులకు రుచి, శుచితో కూడిన భోజనాన్ని అందిద్దామన్నారు. అందుకుగాను ప్రతి నెల తనవంతుగా రూ.25 వేలు అందజేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఇందులో ఉపాధ్యాయులు కూడా తమ సాయం అందించాలని ఆయన కోరారు. స్థానిక టీడీపీ నాయకుల చొరవతో ప్రతి పాఠశాలకు కొంత నిధులను అందించే ప్రక్రియ నూతన సంవత్సరం నుంచి ప్రారంభం అవుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకురాలు వందనాదేవి, జనసేన ఇన్‌చార్జ్ కొర్రపాటి నాగేశ్వరరావు, అభివృద్ధి కమిటీ ఛైర్మన్ షేక్ రవూఫ్, హెచ్ఎం శ్రీనివాసరావు, గింజుపల్లి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ జీ.కరుణ కుమార్, ఎంపీడీవో శివపార్వతి, ఎంఈవోలు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● పెదనందిపాడు, కాకుమాను, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు కూటమి ప్రభుత్వం సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే రామాంజనేయులు అన్నారు. స్థానిక జడ్పీ పాఠశాల, కాకుమాను గురుకుల పాఠశాలలో శనివారం మెగా పేరెంట్స్ - టీచర్స్ మీట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బూర్ల మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన పాఠశాల విద్యను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం నడుం బిగించిందని, వీటి అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వపు విద్యార్థులు, ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల ప్రగతి తెలుసుకోవడానికి, మౌలిక సదుపాయాల అభివృద్ధి, నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, విద్యార్థుల మధ్య మంచి సంబంధాలు నెలకొల్పేందుకు ఈ సమావేశాలు ఎంతో దోహదపడతాయన్నారు. పాఠశాలల్లో ఏవైనా సౌకర్యాలు కావాల్సి ఉంటే ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలన్నారు. పాఠశాల అభివృద్ధికి ఎన్నారైల సహకారంతో లాస్‌ఏంజెల్స్ టీడీపీ అధ్యక్షుడు ఆళ్ళ వెంకట్‌తో పాటు పూర్వపు విద్యార్థుల సంఘం కృషి అభినందనీయమన్నారు. తొలుత మొక్కలు నాటారు. మధ్యాహ్న భోజనాన్ని తిని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మీదుర్గా, ఎంపీడీవో లక్ష్మీదేవి, తహసీల్దార్ శంకర్‌బాబు, ఎంఈవోలు ముద్దన శ్రీనివాసరావు, జోసెఫ్, విద్యాకమిటీ చైర్మన్ కొలగాని ప్రసన్నకుమార్, జిల్లా తెలుగు రైతు కార్యదర్శి మోపర్తి చెంచయ్య, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జంపని హనుమంతరావు, నియోజకవర్గ పరిశీలకురాలు వందనాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● అన్ని ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలను తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం తల్లిదండ్రులకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పూర్వపు విద్యార్థులు, దాతలు తదితరులు పాల్గొన్నారు.


● వట్టిచెరుకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొర్నెపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం నిర్వహించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమ్మేళనానికి ఎమ్మెల్యే బూర్ల ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మండల వ్యాప్తంగా ఉన్న పది జిల్లా పరిషత్ హైస్కూల్స్, ఎంపీపీ స్కూళ్లలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశ కార్యక్రమాలు పండుగ వాతావరణంలో జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో స్థానిక సర్పంచులు, హెచ్ఎంలు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కొర్నెపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రామాంజనేయులు, జనసేన నాయకులు కొర్రపాటి నాగేశ్వరరావు, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణ చంద్రరావు, గ్రామ సర్పంచ్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. కాగా పుల్లడిగుంటలోని ఎంపీపీ స్కూల్లో శనివారం నిర్వహించిన సమావేశానికి ఉప్పుటూరి చినరాములు సేవా ట్రస్ట్ చైర్మన్ చినరాములు ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారుల తల్లిదండ్రులకు తమ సందేశాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బూర్ల, ఉప్పుటూరి చిన రాములు

● మంగళగిరి సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణం, మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం పేరెంట్స్-టీచర్స్ సమావేశాలను వేడుకగా నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు వేలాదిగా పాఠశాలలకు తరలిరావడంతో ప్రభుత్వ పాఠశాలల్లో పండుగ వాతావరణం సంతరించుకుంది. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటపాటలతో అలరించారు. మంగళగిరిలోని వీవర్స్ కాలనీ ఎంటీఎంసీ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనురాధ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం, కార్యసాధన, దూరదృష్టిని అలవాటు చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ తరహా సమావేశాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, నేతలు గుత్తికొండ ధనుంజయరావు, తదితరులు పాల్గొన్నారు. సీకే హైస్కూల్లో జరిగిన సమావేశంలో ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య మాట్లాడుతూ 2047 సంవత్సరానికి వికసిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు సంకల్పించారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, వీటీజేఎం డిగ్రీ కళాశాల డీన్ దామర్ల వెంకట నరసింహం, ప్రధానోపాధ్యాయిని ఏపీఎస్ వరలక్ష్మి, ప్రిన్సిపాల్ రత్నబాబు తదితరులు పాల్గొన్నారు. సీకే బాలికోన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి మాట్లాడుతూ విద్యార్థుల మానసిక వికాసానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ కలయిక ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. కొత్తపేట బీఆర్ నగర్ మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో మాజీ కౌన్సిలర్ రంగిశెట్టి నరేంద్ర, సుఖమంచి గిరి, ప్రధానోపాధ్యాయిని డి.ఉషాకుమారి, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ సీహెచ్ నిర్మల, వైస్‌చైర్మన్ బి.శేఖర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు. చినకాకాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాత, నేరెళ్ల ఫౌండేషన్ చైర్మన్ నేరెళ్ల మురళీ మోహనకృష్ణ, ప్రధానోపాధ్యాయిని కే.శాంతమ్మ, నేరెళ్ల నవీన్ నిశ్చల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● తాడికొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పేరెంట్ టీచర్స్ మీటింగ్ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో ఉత్సాహంగా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. తాడికొండలోని ఏపీ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ నూతక్కి సాంబశివరావు, ఎంపీటీసీ నూతక్కి పరిమళ, ప్రధానోపాధ్యాయిని పావులూరి అనురాధ పాల్గొన్నారు. తాడికొండలోని బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సర్పంచ్ తోకల సరోజిని, పేరెంట్ కమిటీ చైర్మన్ రామకృష్ణ, ప్రిన్సిపాల్ మరియదాసు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఏపీ బాలుర గురుకుల పాఠశాలలో ఎంపీడీవో సమతవాణి, ఎంఈవో తెనాలి ఇందిరా, ఎస్ఎంసీ చైర్మన్ నరసింహారావు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. రావెల జడ్పీ పాఠశాలలో కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, పల్లా కోటేశ్వరరావు, ఎంపీటీసీలు, హెచ్ఎం, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. మోతడకలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, శ్రీరామ హైస్కూల్లో సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కంచర్ల శివరామయ్య, యడ్లపల్లి సాంబశివ రావు, ఉప్పుటూరి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ, మాజీ సర్పంచ్ గుమ్మడిదల తదితరులు పాల్గొన్నారు.



తాడికొండ ఏపీ స్కూల్లో పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు, పేరెంట్స్

● దుగ్గిరాల, డిసెంబరు 7: విద్యార్థులు వారి తల్లిదండ్రులను గౌరవిస్తూ క్రమశిక్షణతో విద్యనభ్యసించి పాఠశాలలు, దేశానికి సేవచేసే పౌరులుగా తీర్చిదిద్దాలని టీడీపీ సాయికుమార్ అన్నారు. దుగ్గిరాలలోని నిమ్మగడ్డ ఫౌండేషన్ జడ్పీ బాలుర హైస్కూల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం శనివారం నిర్వహించారు. జడ్పీటీసీ మేక శివలీల అరుణకుమారి, ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్, విద్యార్థులు, తల్లిదండ్రులనుద్దేశించి ప్రసంగించారు. పెదకొండూరులోని జడ్పీ హైస్కూల్లో హెచ్ఎం వెంకట కృష్ణారావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి గ్రూప్ ఫోటో దిగారు. సాయంత్రం ఆటస్థలంలో ఉపాధ్యాయులతో కలిసి తల్లిదండ్రులు వాలీబాల్ ఆడారు. గ్రామాల్లోని జడ్పీ, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, పిల్లలతో కలిసి ప్రమాణం చేశారు.

● ఫిరంగిపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో మెగా పీటీఎంను శనివారం ఘనంగా నిర్వహించారు. ఫిరంగిపురంలోని సెయింట్ పాల్స్ హైస్కూల్లో మండల ప్రత్యేక అధికారి వి.శంకర్ పాల్గొని రంగ వల్లులను, విద్యార్థుల ఆటల పోటీలను ప్రారంభించారు. నుదురుపాడు జడ్పీ హైస్కూల్లో ఎంఈవో-1 మహబూబ్ సుభానీ, ఎంఈవో-2 రవికాంత్ పాల్గొన్నారు. అలాగే మండల అభివృద్ధి అధికారి ఎం.వెంకటేశ్వర్లు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల శాంతిపేటలో జడ్పీటీసీ దాసరి కత్తిరేణమ్మ తదితరులు పాల్గొన్నారు.

● తుళ్లూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల మార్గనిర్దేశంతో చదువుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వక్తలు అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మీటింగ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం నిర్వహించారు. తుళ్లూరు కేవీఆర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 250 మంది తల్లిదండ్రులు, 550 మంది ఉపాధ్యాయ, ఉపాధ్యేతర సిబ్బంది, విద్యార్థులు, పాఠశాల పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు. తల్లిదండ్రులు పలు క్రీడా పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అందరూ మధ్యాహ్న భోజనం పాఠశాలలో చేశారు. పాఠశాల స్కౌట్ యూనిట్‌ను టీటీడీ బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు, పెద్దలు లాంఛనంగా ప్రారంభించారు. స్కూల్‌కు నన్నపనేని సదాశివరావు ఆర్వో వాటర్ ప్లాంట్ కేటాయిస్తున్నట్టు హెచ్ఎం గుత్తా శ్రీనివాసరావు చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు ఆర్‌వీఆర్ ఎడ్యుకేషన్ కాలేజీ సెక్రటరి గద్దె మంగయ్య, ఏఎన్‌యూ రిటైర్డ్ రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు, పెద్దలు వజ్జా రంగారావు, దామినేని శ్రీనివాసరావు, తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

● తాడేపల్లి/తాడేపల్లి టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నేటి విద్యార్థులే రేపటి దేశసంపద అని ఉండవల్లి ఎంపీయూపీ స్కూల్‌లో జరిగిన మెగా పేరెంట్ టీచర్ మీట్‌లో తహసీల్దార్ సీతారామయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని సీఎం చంద్రబాబు, విద్యా శాఖమాత్యులు నారా లోకేశ్ ఆదేశాలతో ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. డిప్యూటి డీఈవో శాంతకుమారి మాట్లాడుతూ పిల్లల సమగ్ర అభివృద్ధి తెలుసుకునేందుకు ఇదొక మంచి వేదిక అన్నారు. కాగా పట్టణంలోని కేవీఆర్ జడ్పీ హైస్కూల్లో జరిగిన తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ముఖ్యఅతిథిగా లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ రవికుమార్ హాజరై యాంటి డ్రగ్ పోస్టర్ ఆవిష్కరించారు. వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. పెనుమాక, కుంచనపల్లి, ప్రాతూరు, చిర్రావూరు, గుండిమెడ వడ్డేశ్వరం గ్రామాల్లో జరిగిన ఈ సమావేశాల్లో టీడీపీ నేతలు వల్లభనేని వెంకట్రావు, అమరా సుబ్బారావు, జంగాల వెంకటేష్, కొల్లి శేషు, కాట్రగడ్డ మధు, ఈపూరి కోటయ్య, వీరేంద్రనాథ్, జానీఖాన్, చిగురుపాటి సుబ్బారావు, అరవపల్లి శ్రీనివాస్, వీరిశెట్టి శ్రీనివాస్, రంగారావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



తుళ్లూరు కేవీఆర్ జడ్పీ పాఠశాలలో మాట్లాడుతున్న టీటీడీ బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావు

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

● సంఘ జిల్లా అధ్యక్షుడు వడ్డే బాజీబాబు

పెదనందిపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వీఆర్‌ఏల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డే బాజీబాబు అన్నారు. స్థానిక తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఏలకు డ్యూటీ సర్టిఫికెట్‌తో సంబంధం లేకుండా జీతభత్యాలు అందజేయాలని, ఉన్నతాధికారులు వీఆర్‌ఏల చేత వెట్టిచాకిరి చేయించరాదని, సొంత పనులకు వినియోగించరాదని, వీఆర్‌ఏలు మరణిస్తే వారి నామినీకి ఉద్యోగం కల్పించాలని, పే స్కేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని, ఇచ్చిన హామీ మేరకు తమ సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన బాటపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం తహసీల్దార్ శంకర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఖాదర్‌వలి, సంఘ సభ్యులు రాజు, నరేంద్ర, మహేష్, షేక్ ఖాసీం, చంద్రం, ప్రసాద్, అనుపమ, దివ్య తదితరులు పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదే : ఏఎస్పీ

గుంటూరు సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మెరుగైన సమాజ నిర్మాణం కోసం పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదే అడిషినల్ ఎస్పీ టీవీ రమణమూర్తి అన్నారు. శనివారం గుంటూరు రూరల్ మండలం ఏటుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై నిరంతరం నిఘా ఉంచాలని అన్నారు. పిల్లలను ప్రేమతో దగ్గరకు తీసి అన్ని విషయాలు అర్థమయ్యేలా చెప్పి మంచి దారిలో నడిచేలా చూడాలని సూచించారు. విద్యార్థులపై ఉపాధ్యాయుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని అడిషనల్ ఎస్పీ టీవీ రమణమూర్తి అన్నారు. ప్రతి విద్యార్థి విజయగాథ వెనుక ఉపాధ్యాయుల పాత్ర కీలకంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం మంచి ఉద్దేశంతో ఈ సమావేశం ఏర్పాటు చేసిందని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై వాణి, పీఈటీ రాజ్యలక్ష్మి, ఎస్ఐ జనార్దన్, ప్రత్తిపాడు నియోజకవర్గ తెలుగుయువత అధికార ప్రతినిధి ఉగ్గిరాల మార్కండేయులు, నిశ్శంకరావు అమర్నాథ్, ఉగ్గిరాల పూర్ణ, కార్పొరేటర్ దాసరి లక్ష్మీదుర్గ, దాసరి వాసు, జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పు వెంకటరత్తయ్య, మేడూరి చిరంజీవి, టీడీఎస్ శ్రీనివాసరావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారామ స్వామి కల్యాణం





వింజనంపాడులో సీతారాముల దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు, భారీగా హాజరైన భక్తులు

వట్టిచెరుకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వింజనంపాడు గ్రామంలోని శ్రీకోదండరామ స్వామి దేవాలయ 60వ శ్రీరామ నామ సప్తాహ మహోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన సీతారామ స్వామి వారి దివ్య కల్యాణం శనివారం కన్నుల పండువగా జరిగింది. నంబూరి రంగారావు, విమలాదేవి కుమారుడు సాంబశివరావు, సీతమ్మ దంపతులు ఈ కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. పరిసర గ్రామాల నుంచి మహిళలు స్వామి వారి కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు తరలి రావటంతో దేవాలయ ప్రాంగణం కిక్కిరిసి పోయింది. కల్యాణ మహోత్సవానికి వ్యాఖ్యాతగా డాక్టర్ పుల్లాభట్ల వెంకటేశ్వర్లు వ్యవహరించారు. తొలుత ఉదయం చిరుమామిళ్ళ రంగారావు, సామ్రాజ్యమ్మ దంపతులతో విష్ణు సహస్ర నామార్చన పూజలు నిర్వహించారు. సాయంత్రం సీతారాముల గ్రామోత్సవాన్ని గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. రాత్రికి సీతారామ కల్యాణ హరికథ కాలక్షేపం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ మండపంలో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్థుల పూర్తి సహాయ సహకారాలతో రామ నామ సప్తాహ మహోత్సవాలు ప్రారంభం నుంచి కిట్స్ కళాశాల సెక్రటరీ, విజనంపాడు గ్రామానికి చెందిన కోయ శేఖర్ భక్తులు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిత్యం పర్యవేక్షించారు.

ప్రైవేట్ వడ్డీల జోలికి వద్దు.. ప్రభుత్వ బ్యాంకు సేవలే రక్ష

● ఎంపీడీవో ఎం రమేష్‌బాబు

వట్టిచెరుకూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్క వ్యక్తి ప్రైవేట్ వడ్డీల జోలికి వెళ్లకుండా ప్రభుత్వ బ్యాంకు సేవలను మాత్రమే పొందాలని భారతీయ రిజర్వు బ్యాంక్ ముఖ్య ఉద్దేశ్యమని ఎంపీడీవో ఎం రమేష్‌బాబు అన్నారు. వట్టిచెరుకూరు మండలపరిషత్ కార్యాలయంలో భారతీయ రిజర్వు బ్యాంకు సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఖాతాదారుల చైతన్య, అవగాహనపై ఒక రోజు వర్క్ షాపునకు ల్యాంప్ రిసోర్స్‌పర్సన్ కే.వెంకటేశ్వరావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఎంపీడీవో రమేష్‌బాబు పాల్గొని సైబర్ నేరాలపై ప్రజలు, ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చైతన్య బ్యాంకు మేనేజర్ జీ రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవనజ్యోతి సురక్ష లాంటి బీమా సౌకర్యాలను కలిగి సంపాదనలో 20శాతం బ్యాంకుల్లో భద్రపరుచుకోవటం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో బ్యాంకు సేవలు రక్షణగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏపీఎం జయ రామ్, ల్యాంప్ సంస్థ నుంచి రిసోర్స్‌పర్సన్ షేక్ బాజీ, ఎం మంగయ్య, సమైక్య అధ్యక్షురాలు నాగమణి, కిషోర్‌బాబు, యానిమేటర్లు, స్వయం సహాయ సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

చినకాకానిలో కళావేదిక నిర్మాణానికి శంకుస్థాపన

మంగళగిరి సిటీ, డిసెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం చినకాకాని గ్రామంలోని ముప్పవరపు సరోజినమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కళావేదిక నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. నేరెళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కళావేదికను నిర్మిస్తున్నట్టు నేరెళ్ల ఫౌండేషన్ చైర్మన్ నేరెళ్ల మురళీ మోహనకృష్ణ తెలిపారు. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి లోకేశ్ విద్యారంగ అభివృద్ధికి చేస్తున్న కృషితో స్ఫూర్తిని పొంది రూ.15 లక్షల అంచనా వ్యయంతో కళావేదిక నిర్మాణ పనులను ప్రారంభించామని, విద్యార్థులు ఈ కళావేదికను సద్వినియోగం చేసుకుని తమలోని సృజనాత్మక నైపుణ్యాలను ప్రదర్శించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తును పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని కే.శాంతమ్మ, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ బుల్లా నాగేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ భూక్యా శిరీష, కమిటీ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు పోటీపడాలి

● విప్రో కంపెనీ జనరల్ మేనేజర్ ప్రవీణ్ కమత్ కుంబ్లే



సర్టిఫికెట్లు సాధించిన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్, విప్రో జనరల్ మేనేజర్ ప్రవీణ్

తాడికొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నేటి ప్రపంచానికి అనుగుణంగా పోటీపడి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విప్రో కంపెనీ జనరల్ మేనేజర్, హెచ్‌ఆర్ ప్రవీణ్ కమత్ కుంబ్లే అన్నారు. లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా, ఇష్టపడి చదువుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ కళాశాలలోని 110 మంది విద్యార్థులు అనేక జాతీయ, అంతర్జాతీయ సర్టిఫికెట్స్‌ను సాధించినట్లు తెలిపారు. సేల్స్ ఫోర్సెస్ నుంచి 11 మంది, సీఈహెచ్ నుంచి 15 మంది, క్లౌడ్ సైబర్ సెక్యూరిటీ నుంచి ముగ్గురు, సర్వీస్ క్లౌడ్ నుంచి 32 మంది, ఆల్టిరెమ్ నుంచి 14 మంది, మైక్రోసాఫ్ట్ ఏజ్యోర్-ఏ1 నుంచి ఒక్కరు, కోడ్ చెఫ్ నుంచి 27 మంది సర్టిఫికెట్లు సాధించినట్లు తెలిపారు. గ్లోబల్ సర్టిఫికెట్స్ సాధించి కళాశాల రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ వైపీ అంజనేయులు, సెక్రటరి సుజిత్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు

దుగ్గిరాల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మార్గశిరమాసం షష్ఠి సందర్భంగా శనివారం నిర్వహించిన సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకల్లో పరిసర గ్రామాల నుంచి అయ్యప్ప భక్తులు, శివమాల, తిరుపతమ్మ మాల, గంగమ్మ తల్లి మాల ధరించిన భక్తులు పెద్దసంఖ్యలో ఊరేగింపులో పాల్గొన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజా కార్యక్రమాల అనంతరం శ్రీగణేషుడు, శ్రీఅయ్యప్ప, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి చిత్రపటాలతో పాలచెంబులు, బిందెలు శిరస్సున ఎత్తుకుని పాల కావడులతో ప్రారంభమైన అయ్యప్పభక్తుల ఊరేగింపు మార్కెట్ యార్డు వంతెన, శివాలయం సెంటర్, జెండా చెట్టు సెంటర్ మీదుగా, తెనాలి- విజయవాడ ప్రధాన రహదారి మీదుగా అయ్యప్ప ఆలయానికి చేరుకుంది. మహిళలు అయ్యప్పలకు కర్పూర హారతులిచ్చి సాగనంపారు. ఊరేగింపుగా తరలిన అయ్యప్పలు ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన నిప్పుల గుండంలో నడుస్తూ, 18 మెట్లు మీదుగా ఆలయంలోకి చేరుకుని స్వామికి గోక్షీరాన్ని సమర్పించారు. అనంతరం స్వామికి కొలకలూరి శ్రీనివాసశర్మ నేతృత్వంలో పలు రకాల అభిషేకాలు జరిపారు. నిర్వహణ కమిటీ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు.



దుగ్గిరాలలో శ్రీసుబ్రహ్మణ్యషష్ఠి ఊరేగింపులో పాల్గొన్న అయ్యప్పభక్తులు

పెదనందిపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలపరిధిలోని నాగులపాడులో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు కంతేటి రమేష్, నారాయణబొట్ల చైతన్యశర్మ, త్రినాథ్‌లు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. దంపతులచే స్వామివారి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గొల్లపూడి సాంబశివరావు, నర్రా బాలకృష్ణ, దాసరి సత్యనారాయణ పాల్గొన్నారు.

12న పాలస్తీనా సంఘీభావ సభ

గుంటూరు(విద్య),డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 12న అరండల్‌పేటలోని వైన్ డీలర్స్‌కళ్యాణమండపంలో పిడిఎస్‌వో, ఎన్‌వైఎస్ ఆధ్వర్యంలో పాలస్తీనా సంఘీభావ సభ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు ఎన్. భాస్కర్ వెల్లడించారు. ఈ మేరకు శనివారం గుంటూరు ఏసీ కళాశాల వద్ద పోస్టర్స్ ఆవిష్కరించారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ లక్ష్మీసుధ

వైద్యుల సలహా మేరకే
మందులు వాడుకోవాలి

కొల్లిపర, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహా మేరకు మందులను వాడుకోవాలని మండల వైద్యాధికారి లక్ష్మీసుధ అన్నారు. శనివారం మండల పరిధిలోని దావులూరులో వైద్యాధికారులు ఫామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీసుధ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం వలన దీర్ఘకాలిక రోగాలను గుర్తించవచ్చునన్నారు. ప్రతి నెల నిర్వహించు ఎఫ్‌పీసీ క్యాంపులో మంచంలో ఉన్న వారికి కూడా ఇంటికి వెళ్ళి వైద్య సదుపాయం కల్పించనున్నట్లు తెలియజేశారు. గ్రామీణ ప్రజలు మెడికల్ క్యాంపును సద్వినియోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ జానీబేగమ్, ఏఎన్ఎమ్ వసుమతి, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాల్లో పరుచూరి కీలక పాత్ర

తెనాలి అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరిగిన కీలక ఉద్యమాల్లో పరుచూరి నాగేశ్వరరావు చురుకైన పాత్ర పోషించారని సిపిఎం డివిజన్ నాయకులు కొల్లిపర బాబుప్రసాద్ అన్నారు. స్థానిక చెంచుపేట ప్రజా సంఘాల కార్యాలయంలో శనివారం జరిగిన పరుచూరి వర్ధంతిలో ఆయన పరుచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాబూప్రసాద్ మాట్లాడుతూ, కష్టజీవుల తరుపున పోరాటాలు చేశారని, 15 ఏళ్ల వయసులోనే యువజన సంఘాలలో క్రియాశీలక పాత్ర పోషించారని, తెలంగాణా సాయుధ పోరాటంలో పాల్గొన్న ఆయనను కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులు ఇవ్వగా రహస్యంగా మారువేషాల్లో తప్పించుకొని తిరిగారన్నారు. చివరి క్షణం వరకు నమ్మిన సిద్ధాంతాల కోసం పోరాడారని, ఆయన స్ఫూర్తిగా సీపీఎం శ్రేణులు పని చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి, హస్సేన్‌వలి, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసరావు, జోనేష్, రాజ్యలక్ష్మి తదితరుల పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యులు

సీజనల్ వ్యాధులపై వైద్యశిబిరం

తెనాలి అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బుర్రిపాలెం రోడ్డులోని గుప్తా ఫార్మసీ కళాశాలలో శనివారం సీజనల్ వ్యాధులపై అవగాహన శిబిరం నిర్వహించారు. గుంటూరు కిమ్స్ ఆస్పత్రి వైద్యులు శ్రీదేవి సీతా కాలంలో ఎదురయ్యే దగ్గు, జలుబు, ఆస్తమాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. సైనస్, గురక, వర్టిగో సమస్యలను ఈఎన్‌టి వైద్య నిపుణురాలు స్రవంతి వివరించారు. యూనిట్ హెడ్ ముక్తర్ అహ్మద్, ప్రిన్సిపల్ చంద్రకళ, మేనేజర్ శ్రీనివాసరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవానికి హాజరైన భక్త దంపతులు

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి
కల్యాణ మహోత్సవం

పొన్నూరుటౌన్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కట్టెంపూడిలోని నాగేంద్ర స్వామి దేవస్థానం (పుట్ట)లో శనివారం స్వామి వారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. షష్టి పర్వదినం సందర్భంగా ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం క్రతువులు నిర్వహించారు. నారాయణ కేశవ మూర్తి, రవికుమార్, పవన్ కుమార్, అర్చక స్వాముల వేద మంత్రాల నడుమ స్వామి వారి కల్యాణ క్రతువును వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

కొలకలూరులో ఎంపీటీఎం

తెనాలి రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరులో మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో అత్తోట దీప్తి, గ్రామ సర్పంచ్ చొప్ప రప్రీతీ, ఎంఈవో లక్ష్మినారాయణ, రూరల్ ఎస్ఐ ప్రతాప్‌కుమార్, స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ జిలాని పాల్గొని విద్యాభివృద్ధికి కృషి చేస్తామని తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్ఐ ప్రతాప్‌కుమార్ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు.

క్రమశిక్షణతో మెలిగితే మంచి భవిష్యత్తు

● మెగా పేరెంట్స్ టీచర్స్ కమిటీ సమావేశంలో ఎస్పీ సతీష్ కుమార్

తెనాలి అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో చదువుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుందని జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఎస్.సతీష్‌కుమార్ అన్నారు. చెంచుపేట కెఎస్ఎం హైస్కూల్లో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. హెచ్ఎం రాజారెడ్డి అధ్యక్షతన జరిగినసభలో విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ నేటి సమాజం చెడు వైపు ఆకర్షితుమవుతోందని, ఆ దిశ నుంచి సభ్య సమాజం వైపు మళ్లించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులను సెల్‌ఫోన్ నుంచి తల్లిదండ్రులు దూరం పెట్టాలని, వారు ఏం చేస్తున్నారో ఓ కంట గమనిస్తుండాలన్నారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కుమార్ పంప్స్ ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కౌన్సిలర్ మానసరెడ్డి, వెలగా సుభాష్ చంద్రబోస్, నాగమణి, రమ్యకృష్ణ, ఆంజనేయశర్మ తదితరులు ప్రసంగించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం సూచించిన ప్రతిజ్ఞ చేశారు.

బాలికలు తలుచుకుంటే సాధించలేనిదేది లేదు
- సబ్ కలెక్టర్ సంజనా సిన్హా

బాలికలు తలుచుకుంటే సాధించలేనిది లేదని సబ్ కలెక్టర్ సంజనా సిన్హా అన్నారు. కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. నేటి



కేఎస్ఎం హైస్కూల్లో ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, కమిషనర్ శేషన్న, సుబ్రహ్మణ్యం తదితరులు

సమాజంలో పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని, ఇందుకు ప్రభుత్వాలు ఎన్నో అవకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు. పిల్లలకు ఇష్టమైన రంగంలో తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని, అలా కాకుండా తమ అభిప్రాయాలను పిల్లలపై బలవంతంగా రుద్దితే ఆశలు అడియాశలు అవుతాయని గుర్తించాలన్నారు.

మెగా పేరెంట్ కమిటీ సమావేశాలకు పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు తరలి వచ్చారు. వారికి ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు ఆహ్వానం పలికి తరగతి గదుల్లో తమ పిల్లలతో పాటు కూర్చుని వారి విద్యాభ్యాసాన్ని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి పలు పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు.



సభలో మాట్లాడుతున్న వీరవల్లి మురళి

విద్యార్థుల బంగారు భవిష్యత్తే ప్రభుత్వ లక్ష్యం
- టీడీపీ సీనియర్ నేత వీరవల్లి మురళి

తెనాలిరూరల్, (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బంగారు భవిష్యత్తుకి బాటలు వేయటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నేత వీరవల్లి మురళి అన్నారు. మండలంలోని అంగలకుదురు జడ్పీహెచ్ఎస్ స్కూల్లో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో గ్రామ సర్పంచ్ ఊసరపు రాజ్యలక్ష్మి, ఉప సర్పంచ్ కనగాలనాగభూషణం, రూరల్ సీఐ బెల్లం శ్రీనివాసరావులతో కలిసి ముఖ్య అతిథిగా మురళి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలన ఉచిత పథకాలను పొందటంతో సాధ్యం కాదన్నారు. పేదల బిడ్డలు ఎప్పుడైతే ఉన్నత చదువులు చదవి గొప్ప విద్యావంతులుగా తయారవుతారో ఆరోజే నిజమైన పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. సీఐ బెల్లం శ్రీనివాసరరావు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు సైబర్ నేరస్థుల వలలో చిక్కుకోకుండా ఉండాలని సూచిస్తూ పలు జాగ్రత్తలను వివరించారు. స్మాట్ ఫోన్‌లో బ్యాంక్‌కు సంబంధించిన లావాదేవీ అదే విధంగా విద్యార్థులు చెడు అలవాట్లకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని తల్లిదండ్రులకు సూచించారు. తొలుత విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులను, అతిథులను అలరించాయి. అనంతరం విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరం కృషిచేస్తామని ప్రతిజ్ఞచేయించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం అనురాధ, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ అంజలీదేవి, కమిటీ సభ్యులు, రూరల్ ఎస్ఐ అమీర్, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని 18 గ్రామాల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

మాతృభాషకు ప్రాధాన్యమివ్వండి

● పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ
● కోలాహలంగా మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీట్

పొన్నూరుటౌన్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి):మాతృభాషకు ప్రాధాన్యమివ్వడం ద్వారా విద్యలో రాణించవచ్చని ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్, పాఠశాల పూర్వ విద్యార్థి ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో అన్ని ప్రభుత్వ పాఠశాల్లో శనివారం మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీట్ కార్యక్రమం కోలాహలంగా జరిగింది. నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్యే నరేంద్ర, ఎయిర్ చీఫ్ వైస్ మార్షల్, పాఠశాల పూర్వ విద్యార్థి ఎస్ఎం సుభానీ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యం పెంపొదించేందుకు ఈ సమావేశం ఒక వేదికగా మారుతుందన్నారు. గతంలో కంటే ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల పర్యవేక్షణ తగ్గిందన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయులు మెరుగైన విద్యాబోధన అందించాలని సూచించారు. విద్యార్థులు చదువు ప్రాధాన్యతను గుర్తించి తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంగ్లీష్ మీడియం అంటే ఆసక్తి పెరిగిందని దాని నుంచి బయటపడి మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మాతృభాష తెలుగులో చదివేందుకు కూడా విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ప్రాథమిక పాఠశాల విద్యను మాతృభాషలో అభ్యసించిన ఎందరో ఉన్నత శిఖరాలకు ఎదిగారని గుర్తుచేశారు. సోషల్ మీడియా, సెల్‌ఫోన్ల వినియోగం గురించి ప్రస్తావించిన ఎమ్మెల్యే, విద్యార్థుల తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. ఎస్ఎం సుభాని మాట్లాడుతూ నిడుబ్రోలు ప్రభుత్వ పాఠశాల్లో విద్యను అభ్యసించిన తాను రక్షణ రంగంలో అనేక పదవులు పొందినట్లు చెప్పారు. విద్యార్థులు చిన్న తనం నుంచే ఒక లక్ష్యం పెట్టుకుని, గురువుల సహకారంతో దాని సాధన కోసం శ్రమించాలని సూచించారు. ఈ సందర్భంగా తను గురువులను, తోటి విద్యార్థులను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల్లో అందుతున్న విద్య, సౌకర్యాల గురించి తెలిపారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్నభోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా వారికి నగదు పురస్కారాలు, బహుమతులు అందించారు. సమావేశంలో ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు, అర్బన్ సీఐ రవి కిరణ్, కూటమి నేతలు పాల్గొన్నారు.

కనుల పండువగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

● పాల్గొన్న మాజీ మంత్రి ఆలపాటిరాజేంద్రప్రసాద్ దంపతులు

తెనాలి రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వల్లి దేవసేనసమేత సుబ్రహ్మణేశ్వర స్వామి వారి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. మండలంలోని పెదరావూరు సుబ్రహ్మణ్యపురంలో కొలువుదీరిన మహావిద్యాపీఠం అభయహస్త సుబ్రహ్మణ్యస్వామి వారి దేవస్థానంలో చతుర్థవార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం స్వామి వారి కల్యాణాన్ని జరిపారు. మాజీ మంత్రి, గుంటూరు, కృష్ణ ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాధవి దంపతులు ఆలయానికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకొని కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. స్వామి వారి కల్యాణం అనంతరం వేద పండితులు ఆలపాటి దంపతులకు ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ స్వామి వారిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతంగా లభించినట్లు తెలిపారు. అభయహస్త సుబ్రహ్మణ్యస్వామి వారి దయతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని



స్వామి వారి కల్యాణంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్,మాధవి దంపతులు

వేడుకున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు పాలడుగు సురేంద్ర, కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, సినీ రచయిత బి.సాయిమాధవ్, గోపి స్థానిక నాయకులు శ్రీ మహావిద్యాపీఠం కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్
● అధికారులతో సమీక్ష

పొన్నూరుటౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విషయంలో సివిల్ సప్లయిస్ అధికారులపై ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం సివిల్ సప్లయిస్, రెవెన్యూ అధికారులతో ధాన్యం కొనుగోలుపై సమీక్షా సమావేశం జరిగింది. ఇప్పటి వరకు ఎంత ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేశారని ఎమ్మెల్యే ప్రశ్నించగా, సివిల్ సప్లయిస్ డిప్యూటి తహసీల్దార్ వెంకట్రావు నుంచి సమాధానం కరువైంది. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, పర్యవేక్షించాల్సిన అధికారులు ఏంచేస్తున్నారని ప్రశ్నించారు. డీఎస్‌వో కోమలి పద్మ కలగజేసుకుని ఇప్పటివరకు పొన్నూరు మండలంలో 420 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వారీగా వివరాలు అందజేయాలని ఎమ్మెల్యే కోరగా దానికి సమాధానం కరువైంది. రైస్ మిల్లర్ల సమావేశ వివరాలు అధికారులు చెప్పడంపై నరేంద్ర మండిపడ్డారు. రైస్ మిల్లర్ల సేవలో కాదు రైతు సేవలో ఉండాలని అధికారులను ఆదేశించారు. ఇక నుంచి రోజు వారి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి వ్యవసాయశాఖతో సమన్వయం చేసుకుంటూ రోజు వారీ కొనుగోలు వివరాలు తనకు అందజేయాలని ఆదేశించారు.



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

రైతుల నుంచి ధాన్యం కొనలేకపోతున్నాం: రైస్‌మిల్లర్లు

ఇతర నియోజకవర్గానికి చెందిన ధాన్యాన్ని ఉన్నతాధికారులు కొనుగోలు చేసి పొన్నూరు రైస్ మిల్లులకు తరలిస్తున్న కారణంగా తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఈ సందర్భంగా మాట్లాడిన పలువురు రైస్ మిల్లర్లు తెలిపారు. 25శాతం తేమ ఉన్న ధాన్యాన్ని కూడా అధికారులు పంపుతున్నారని వాపోయారు. ధాన్యం నిల్వ చేసుకునే వీలు లేక స్థానిక రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయలేకపోతున్నామని అన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, సివిల్ సప్లయిస్ ఉన్నతాధికారులతో చర్చిస్తానని చెప్పారు. ముందు స్థానిక రైతుల ధాన్యం కొనుగోలు చేసి మిగిలితే ఇతర ప్రాంతాల రైతుల ధాన్యం కొనుగోలు చేయాలని సివిల్ సప్లయిస్ అధికారులను సూచించారు. సమావేశంలో తహసీల్దార్ జియావుల్ హక్, డిప్యూటీ తహసీల్దార్ రాజారమేష్ మోహన్ సీఎస్ డీటీ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై తల్లిదండ్రులూ
ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

కొల్లిపర, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలంటే ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. శనివారం మండల పరిధిలోని గ్రామాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలల్లోని మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించడంతో పాటు ప్రగతిపై చర్చించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ విద్యార్థులను తల్లిదండ్రులు ఎప్పుడూ గమనిస్తూ ఉండాలన్నారు. ఎస్ఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలుగా కాకూడదని అన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో విజయలక్ష్మీ, ఎంఈవోలు సాల్మన్‌రాజు, ఝాన్సీలత, రిటైర్డ్ ఎంఈవో ఆరిమండ బసవకుటుంబరెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



తూములూరు సభలో మాట్లాడుతున్న ఎస్ఐ కోటేశ్వరరావు


ప్రశాంతతకు మారుపేరుగా
గుంటూరు జిల్లాను తీర్చిదిద్ధుతాం



పోలీస్ క్వార్టర్స్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

● జిల్లాలో 30శాతం తగ్గిన క్రైమ్ రేట్
● తెనాలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం
● ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు
● పోలీస్ క్వార్టర్స్‌పై అధికారులతో ఆరా
● రౌడీషీటర్లపై పోలీసుల ప్రత్యేక దృష్టి
● ఎస్పీ సతీష్‌కుమార్

తెనాలి రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తూ ప్రశాంతతకు మారుపేరుగా గుంటూరు జిల్లాను తీర్చిదిద్దుతామని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ చెప్పారు. శనివారం తెనాలి పట్టణానికి విచ్చేసిన ఎస్పీ సతీష్‌కుమార్ పాత పోలీస్ క్వాటర్స్‌ను డీఎస్పీ జనార్ధన్‌రావు, సీఐలతో కలిసి పరిశీలించారు. క్వార్టర్స్ దుస్థితిపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాలను పరిశీలించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా ట్రాఫిక్ సమస్యపై కూడా అందుబాటులో ఉన్న సిగ్నల్స్‌ను సద్వినియోగం చేసుకునే అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ గతంలో గంజాయి, అక్రమ మద్యం, రౌడీయిజానికి, ఇతర నేరాలకు అడ్డాగా గుంటూరు జిల్లాలో పలు ప్రాంతాలు మారాయని అటువంటి వాటిపై కఠినంగా వ్యవహరిస్తూ అదుపులోకి తీసుకువచ్చామన్నారు. జిల్లాలో ఇప్పటికే 30 శాతం మేర నేరనియంత్రణ అదుపులోకి వచ్చిందన్నారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులపై పోలీసుల నిఘా పెంచామని ఎక్కడా కూడా అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పకట్బందీగా చర్యలు చేపట్టామన్నారు. తెనాలి ప్రాంతంలో శిథిలావస్థలో ఉన్న పోలీస్ క్వాటర్స్‌ను పరిశీలించామని త్వరలోనే దీనిపై తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. అదే విధంగా శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా అనుమానాస్పద ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటి ద్వారా కంట్రోల్ రూమ్‌లో పర్యవేక్షణ చేసే విధంగా దాతల సహకారంతో వాటిని ఏర్పాటు చేసే ప్రయత్నం జరుగుతుందన్నారు. ట్రాఫిక్ సమస్య జటిలంగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని దాని పరిష్కారానికి అందుబాటులో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్‌తో పాటు అవసరమైన చర్యలు తీసుకునేలా అధికారులకు సూచనలు చేశామన్నారు. పోలీసులకు అన్ని శాఖలు సమన్వయంగా ఉంటూ నేర నియంత్రణలు భాగస్వాములు కావాలని ఆయన కోరారు. సీఐలు బెల్లం శ్రీనివాసరావు, రమేష్‌బాబు, రామలానాయక్, మల్లికార్జున రావు పలువురు ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.



సీసీ కెమెరాల ఏర్పాట్లపై డీఎస్పీ తో మాట్లాడుతున్న ఎస్పీ

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడలు

● జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వరరావు

చేబ్రోలు, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంభిస్తే నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని శలపాడులో శనివారం వరి పంట కోత ప్రయోగం జరిగింది. గ్రామానికి చెందిన రైతు సతీష్ గత ఐదేళ్లుగా ప్రకృతి పద్ధతుల్లో వరి పంట సాగు చేస్తున్నారు. ఈ విధానంలో సాగైన వరి పంట కోత ప్రయోగాన్ని పరిశీలించేందుకు ఆయన హాజరయ్యారు. పంట కోత ప్రయోగం ద్వారా 38 బస్తాల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ రైతులు ప్రకృతి పద్ధతులు అలంబించడం ద్వారా రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం, సాగు వ్యయం తగ్గి, అధిక దిగుబడులను సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు షైలా వెంకట రామరాజు, ఏవో శ్రీనివాస నాయక్ పాల్గొన్నారు.



శలపాడులో పంట కోత ప్రయోగం పరిశీలిస్తున్న జేడీఏ వెంకటేశ్వరరావు

షేక్ మస్తాన్ మృతి టీడీపీకి తీరని లోటు

పొన్నూరుటౌన్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): షేక్ మస్తాన్ మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. ఎమ్మెల్యే అభిమాని అయిన నిడుబ్రోలు 14వ వార్డుకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త షేక్ మస్తాన్ శుక్రవారం శ్రీశైల పుణ్యక్షేత్ర దర్శనానికి వెళ్లి మృతి చెందారు. మస్తాన్ మృతదేహాన్ని శనివారం పొన్నూరుకు తీసుకువచ్చారు. మస్తాన్ మృతదేహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే నివాళులర్పించారు. మస్తాన్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



మస్తాన్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

క్రైమ్ జోన్

భర్త వేధింపులపై ఫిర్యాదు

తెనాలి క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తన భర్త మానసికంగా వేధిస్తున్నాడని, హింసకు గురి చేస్తున్నాడని వన్ టౌన్ పోలీసులకు తలపాల మాధవి శనివారం ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక గురవయ్య కాలనీకి చెందిన తలపాల మాధవి తన భర్త లక్ష్మీతిరుమలరావు తనను గత కొంత కాలంగా తరచూ శారీరకంగా, మానసికంగా హింసకు గురి చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు

తెనాలి అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి : పట్టణంలోని గంగానమ్మపేటలో గల కంప్యూటర్ షాపులో పని చేస్తున్న యువతి అదృశ్యంపై టు టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కొలకలూరుకు చెందిన నరసింహారావు కుమార్తె వెన్నెల(24) తెనాలిలోని తన బంధువులకు చెందిన కంప్యూటర్ షాపులో రోజూ వచ్చి పని చేసి వెళుతుంది. ఈ నెల 5న షాపుకు వెళ్లి రాత్రి 8 గంటలకు సినిమాకు వెళుతున్నానని చెప్పి ఇంటికి చేరలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో విచారించినప్పటికీ ఆచూకీ తెలియకపోవడంతో నరసింహారావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ బాబురావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి మృతికి కారణమైన రైతుపై కేసు

కొల్లిపర, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి మృతికి కారణమైన రైతుపై కేసు నమోదు చేసినట్లు కొల్లిపర ఎస్ఐ కోటేశ్వరరావు శనివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామానికి చెందిన మాధవరావు తన ఇంటి దగ్గర నుంచి గ్రామ సెంటర్‌కు నడిచి వెళుతుండగా అదే గ్రామానికి చెందిన దేశబోయిన నాగగోపి ఎడ్ల బండి తోలుకుంటూ మధవరావు వెనుకగా వస్తున్నాడు. ఆ సమయంలో మాధవరావు దగ్గరకు రాగానే ఎడ్ల బండి కాడి అతనికి తగలటంతో తూలి బండి టైర్లు కింద పడి మృతి చెందాడు. మృతుడు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు.

సహకార బ్యాంకు విశ్రాంత ఏజీఎం మృతి

తెనాలి అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు విశ్రాంత అసిస్టెంట్ జనరల్ మేనేజర్ చెరుకూరి వెంకటసుబ్బారావు (87) శనివారం మృతి చెందారు. చినరావూరులో నివసిస్తున్న ఆయన భౌతికకాయాన్ని పలువురు ఉద్యోగులు సందర్శించి నివాళులర్పించారు.